
ఆంధ్రజ్యోతి
5 ప్రకాశం
గురువారం 16 జనవరి 2025



కొప్పోలులో దేవుళ్ల తెప్పోత్సవం





ఒంగోలు అప్పాయకుంట తెప్పోత్సవంలో సీతారామ లక్ష్మణులకు పూజలు

ఊరూరా సంబరం

- ఉత్సాహంగా సంక్రాంతి
- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- కనుమ సందర్భంగా పార్వేట, తెప్పోత్సవాలు
- అలరించిన క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పండుగ సందర్భంగా పల్లె మొదలు నగరాల వరకు అంతటా సందడి వాతావరణం నెలకొంది. ఆటపాటలు, ఎడ్ల పోటీలను చూసేందుకు ప్రజలు ఉత్సాహం కనబరిచారు. ఇక గాలిపటాలు ఎగురవేస్తూ చిన్నారులు ఆనందంతో కేరింతలు కొట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలలో యువత ఉల్లాసంగా పాల్గొని సందడి చేసింది. జిల్లాకేంద్రమైన ఒంగోలు నగరంతోపాటు మార్కాపురం, భైరవకోన, త్రిపురాంతకం, మిట్టపాలెం, సింగరాయకొండ, రామతీర్థం మొదలైన ప్రసిద్ధ ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల తెప్పోత్సవాలు జరిగాయి. ఒంగోలులోని గద్దలగుంటతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పార్వేటలకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

- ఒంగోలు కల్చరల్



ఒంగోలు గద్దలగుంటలో నగరోత్సవం



విద్యుత్ వెలుగుల్లో ఒంగోలులోని అప్పాయకుంట ప్రసన్నాంజనేయస్వామి ఆలయం



లబ్ధిదారుల కుటుంబసభ్యులను విచారిస్తున్న తనిఖీ బృందం

అక్రమాలు ధ్రువీకరణ

- ఆరోగ్య పింఛన్ల తనిఖీల్లో బోగస్‌లు కోకొల్లలు
- వెలుగుచూస్తున్న తప్పుడు పత్రాలు
- కంభంలో నెట్ సెంటర్ కేంద్రంగా అక్రమం
- జిల్లాలో మిగతా చోట్లా ఈ తరహాలోనే..
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.25 వేలు వసూలు
- పింఛన్ మంజూరుకూ వాటా
- పశ్చిమ ప్రాంత లబ్ధిదారుల్లో ఎక్కువ మందికి గుంటూరు జిల్లా వైద్యశాల నుంచే పత్రాలు
- విస్తుపోతున్న తనిఖీ బృందాలు

జిల్లాలో ఆరోగ్య పింఛన్లలో జరిగిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకొని స్థానిక నాయకుల అండదండలతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకొని ప్రభుత్వ సొమ్మును దిగమింగుతున్న అనర్హుల లెక్క బయటపడుతోంది. అక్రమాలపై పది రోజుల నుంచి మండలాల వారీగా బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి. బోగస్ లబ్ధిదారులనూ, వారికి ధ్రువీకరణ పత్రాలు వచ్చిన తీరునూ తెలుసుకుని బృందాల్లోని సభ్యులు ఆశ్చర్యపోతున్నారు.

- ఒంగోలు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

గుంటూరు జిల్లా ధ్రువీకరణ పత్రాలతో ఇక్కడ పింఛన్

తనిఖీ బృందాలు వస్తున్నట్లు ముందుగానే ఆయా లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగుల ద్వారా నోటీసులు ఇచ్చారు. అనేక గ్రామాల్లో లబ్ధిదారులు అప్పటికప్పుడు హడావుడిగా తాము అనారోగ్యంతో ఉన్నట్లు చెప్పేందుకు ఇంటిలో ఒకవైపు మంచం వేసుకొని పడుకొనే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. బృందం సభ్యులు వైద్యాధికారులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలు అడిగి వాటిని పరిశీలిస్తున్నారు. అయితే పశ్చిమ ప్రాంతంలోని సగానికిపైగా లబ్ధిదారులు గుంటూరు జిల్లాలో వైద్య ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకున్నట్లు బృందాలు గుర్తించాయి.

కంభంలో నెట్‌సెంటర్ కేంద్రంగా అక్రమాలు

బోగస్ లబ్ధిదారులను బృందాలు ప్రశ్నించడంతో ఫలానా వ్యక్తి నగదు తీసుకుని తమకు సర్టిఫికెట్ ఇప్పించారని చెబుతున్నారు. కంభంలోని ఒక నెట్ సెంటర్ ద్వారానే ఈ తతంగం నడిచినట్టు తనిఖీ బృందాలు గుర్తించాయి. ఆ నెట్‌సెంటర్ నిర్వాహకుడు ధ్రువీకరణ పత్రం కోసం నమోదు చేసి ఆయా వైద్యాధికారులతో మాట్లాడి సర్టిఫికెట్లు మంజూరు చేయించినట్లు బృందాలు గుర్తించాయి. ఒక్కొక్క ధ్రువీకరణ పత్రం కోసం రూ.20 వేల నుంచి రూ.25వేలు నెట్‌సెంటర్ నిర్వాహకుడు వసూలు చేసినట్టు బయటపడింది. మరోవైపు ధ్రువీకరణ పత్రం వచ్చాక లబ్ధిదారుడికి ఆరోగ్య పింఛన్ మంజూరు చేసేందుకు ఒక నెల పింఛన్ ఇచ్చేలా ఒప్పందాలు కూడా జరిగినట్టు బృందాల దృష్టికి వచ్చింది.

ఆరోగ్యంగా ఉన్నవారికీ పింఛన్

పింఛన్ పొందేందుకు అన్ని అవయవాలూ బాగున్న వ్యక్తులు కూడా తమకు పక్షవాతం, క్యాన్సర్, ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయినట్టు ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకొని పింఛన్లు తీసుకుంటున్నారు. విచారణ బృందాలు తనిఖీ చేసే సమయంలో కొంత మంది ఆరోగ్య పింఛన్లు పొందుతూ మోటార్ సైకిళ్ల మీద ఇళ్లకు రావడం, ట్రాక్టర్లు తోలడం, పనులకు వెళ్లడం వంటి వాటిని కూడా గుర్తించినట్లు తెలిసింది. వారందరికీ ధ్రువీకరణ పత్రాలు ఏవిధంగా ఇచ్చారో వైద్య బృందాలు తేల్చే పనిలో ఉన్నాయి. జిల్లాలో విచారణ పూర్తయితే ఎన్ని బోగస్ పింఛన్లు ఉన్నాయో బహిర్గతమయ్యే అవకాశం ఉంది.



ఎస్‌ఎన్‌పాడులోని ముగ్గువాగు వద్ద బరిలో కోడి పందేలను తిలకిస్తున్న జనం

ఆగని కోఢి

జిల్లాలో పందెం కోళ్లు రెక్కలు విప్పాయి. కత్తికట్టి కాలుదువ్వాయి. రూ.కోట్లలో డబ్బులు చేతులు మారాయి. పలు గ్రామాల్లో పండుగ మూడ్రోజులు కోడి పందేలు జోరుగా సాగాయి. అధికారపార్టీకి చెందిన నాయకుల అండతో పందెం రాయుళ్లు రెచ్చిపోయారు. పలు గ్రామాల్లో గోదావరి జిల్లాల స్థాయిలో బరులు నడిచాయి. కోడి పందేలు నిర్వహించినా, జూదం ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని అటు కలెక్టర్ అన్సారి యా, ఇటు ఎస్పీ దామోదర్ హెచ్చరించినా ఎవరూ ఖాతరు చేయలేదు. తమ అనుయాయులతో ఎక్కడికక్కడ కోడి పందేలు, పేకాట శిబిరాలను నిర్వహించారు.

- రెక్కలు విప్పిన పందెం
- యథేచ్ఛగా బరులు ఏర్పాటు
- చేతులు మారిన రూ.కోట్లు
- నిర్వాహకులకు 10శాతం కమీషన్
- కొన్నిచోట్ల ప్రవేశ రుసుం
- పట్టించుకోని పోలీసులు
- రాజకీయ ఒత్తిళ్లే కారణం

ఒంగోలు (క్రైం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడి పందేలు జోరుగా సాగాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలు నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల అసెంబ్లీ సెగ్మెంట్‌లలో బరితెగించి మరీ పందేలు నడిచాయి. తీరప్రాంతంలోని అనేక గ్రామాల్లోనూ పందెం కోళ్ల రెక్కలు విప్పి రక్తం చిందించాయి. బరుల వద్ద మద్యం ఏరులై పారింది. కొన్నిచోట్ల లాటరీలు, గుండాటలు కూడా సాగాయి. జిల్లావ్యాప్తంగా పేకాట శిబిరాలు మూడు రోజులపాటు ముమ్మరంగా సాగాయి. రూ.కోట్లల్లో నగదు చేతులు మారింది.

కొణిజేడు కొండల వద్ద రూ.కోట్లలో పందెం

జోడికి లక్ష రూపాయలు.. రోజుకు ముప్పై జతలు.. వీటికితోడు పైపందేలు.. ఇదీ టంగుటూరు మండలం కొణిజేడు కొండల వద్ద మూడు రోజులపాటు సాగిన కోడిపందేల తీరు. ఇతర జిల్లాల నుంచి కూడా పందెం రాయుళ్లు తరలివచ్చారు. తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన వారు కార్లలో కోళ్లను తెచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బరుల్లో కోడి పందేలు వేశారు. రూ.కోట్లలో పందెం సాగింది. జనాన్ని అదుపు చేయడానికి బౌన్సర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో పందేనికి వచ్చిన మొత్తంలో 10శాతం నిర్వాహకులు కమీషన్ కింద వసూలు చేశారు. బరుల వద్దనే మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగాయి. ప్రత్యేకంగా బిర్యానీ పాయింట్లు, తినుబండారాల దుకాణాలను కూడా ఏర్పాటు చేశారు. కానీ పోలీసులు ఆవైపు కన్నెత్తి చూడలేదు.

తీరప్రాంతంలో భారీగా..

తీరప్రాంతంలో కోడి పందేలు భారీగా జరిగాయి. చాలాచోట్ల షామియానాలతో ఇనుప కంచెల మధ్య బరులను ఏర్పాటు చేశారు. అక్కడ ప్రజలను అదుపు చేసేందుకు సైకిల్ రబ్బర్ ట్యూబ్‌లను వినియోగించారు. ఒంగోలు మండలం గుండాయిపాలెం, పెదగంజాం-నాగులుప్పలపాడు మధ్య పల్లెపాలెం, కొత్తపట్నం మండలం గవళ్లపాలెం, పట్టపుపాలెంలలో కోడి పందేలు జోరుగా సాగాయి. సింగరాయకొండ మండలంలోని అనేక తీరప్రాంత గ్రామాల్లో కోడి పందేలు వేశారు.

సంతనూతలపాడు నియోజకవర్గంలో..

సంతనూతలపాడు నియోజకవర్గంలో పందెం రాయుళ్లు 'బరి'తెగించారు. సంతనూతలపాడులోని ఎనికపాడుకు వెళ్లే ముగ్గు వాగు వద్ద ఓ మాజీ ప్రజాప్రతినిధి నేతృత్వంలో బరిని ఏర్పాటు చేశారు. అక్కడ పెద్దఎత్తున పందేలు సాగాయి. సదరు మాజీ అనుమతితో బి.మాచవరంలోనూ అదేవిధంగా నడిచాయి. బరుల వద్ద కూర్చొని పందెం చూసేందుకు రూ.10వేల వరకూ ఎంట్రీ ఫీజు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇలామూడు రోజులపాటు సాగిన పందేల్లో రూ.లక్షలు చేతులు మారాయి. చీమకుర్తి మండలం మర్రిపాలెం, మంచికలపాడు, దేవరపాలెం పరిసర ప్రాంతాల్లో మూడు కేటగిరీలుగా కోడి పందేలు వేశారు. రూ.10వేలు, రూ.50 వేలు, రూ.లక్ష విభాగాల్లో పందెం నడిచింది. బహిరంగా మద్యం విక్రయించారు. బిర్యానీ అమ్మకాలు కూడా జోరుగా సాగాయి.



కొత్తపట్నం మండలం గవళ్లపాలెంలో పందెం కోళ్ల పోరు

కన్నెత్తి చూడని పోలీసులు

కోడి పందెం బరులవైపు పోలీసులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్ నుంచి కిందిస్థాయి పోలీసు అధికారుల వరకూ పండుగకు వారం ముందు నుంచే ప్రకటించారు. ఎక్కడ పందేలు వేసినా ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. అయితే మూడు రోజులుగా జోరుగా పందేలు నడుస్తున్నా పట్టించుకోలేదు. అందుకు కోడి పందెం నిర్వాహకులకు అధికార బలం ఉండటం, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. కొన్నిచోట్ల బరుల నిర్వాహకుల నుంచి పోలీసులకు పెద్దమొత్తంలో డబ్బులు ముట్టినట్టు సమాచారం.

మరణంలోనూ వీడని మైత్రి

- చెరువులో పడి ఇద్దరు బీటెక్ విద్యార్థులు మృతి
- అల్లూరు అంబేడ్కర్ నగర్‌లో విషాదం

కొత్తపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మరణంలోనూ వారు స్నేహబంధం వీడలేదు. కలిసి చదువుకుంటూ పెరిగిన వారు ఒకేసారి ప్రాణాలు కోల్పోయారు. చెరువు రూపంలో మృత్యువు వీరిని మింగేసింది. ఇద్దరి కుటుంబాల్లోనూ అంతులేని శోకాన్ని మిగిల్చింది. అల్లూరులోని అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం ఈ విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మిట్నసల ఆదిత్య (19), కొల్లాబత్తిని గిరి (20) బాల్య స్నేహితులు. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఒకేచోట చదువుకున్నారు. ప్రస్తుతం ఒకరు విజయవాడలో, ఇంకొకరు భీమవరంలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ నాలుగు రోజుల క్రితం సంక్రాంతి సెలవులకు స్వగ్రామమైన అల్లూరు వచ్చారు. అప్పటి నుంచి కలిసే తిరుగుతున్నారు. మంగళవారం ఉదయం గ్రామానికి తూర్పువైపున ఉన్న సాగునీటి చెరువు వద్దకు వెళ్లారు. సాయంత్రం 4 గంటల వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెతుకులాట ప్రారంభించారు. ఇద్దరి సెల్‌ఫోన్లు రింగ్ అవుతున్నా ఎత్తలేదు. చివరకు చెరువుకు ఉన్న తూముపై ఇద్దరి సెల్‌ఫోన్లు, చెప్పులు కనిపించడంతో ఆ ప్రాంతంలో దిగి గాలింపు చేపట్టగా మృతదేహాలు కనిపించాయి. తూముపై కూర్చుని మాట్లాడుకుంటూ ఒకరు ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయి ఉంటారని, ఇంకొకరు కాపాడే ప్రయత్నంలో చెరువులో పడి మరణించి ఉంటారని గ్రామస్థులు భావిస్తున్నారు. ఆదిత్య తండ్రి మిట్నసల శత్రుఘ్న, గిరి తండ్రి వెంగయ్య రోజువారీ కూలి పనులకు వెళ్లి కుటుంబాలను పోషిస్తున్నారు. ఆదిత్య ఆ కుటుంబానికి ఒక్కడే కొడుకు. వెంగయ్యకు రెండో కుమారుడు గిరి. ఆదిత్య, గిరి ఇద్దరూ చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేవారు. చేతికంది వచ్చే సమయంలో అర్ధంతరంగా తనువు చాలించడంతో ఇద్దరి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. అల్లూరు అంబేడ్కర్ నగర్‌లో విషాదఛాయలు అలముకున్నాయి.



ఆదిత్య (ఫైల్)



గిరి (ఫైల్)

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

● ఆటపాటలతో యువత హుషారు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి పండుగను ఒంగోలు నగరంలో మూడు రోజుల పాటు ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆటల పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

- స్థానిక దిబ్బలరోడ్డులో ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం ఆటల పోటీలు, ముగ్గులపోటీలు, మ్యూజికల్ చైర్స్, క్లాత్ గేమ్, రన్నింగ్, స్లోసైక్లింగ్, డాన్స్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఐద్వా నగర కార్యదర్శి కంకణాల రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలోత్సవ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎం.రామరాజు, నాయకులు జి.కళ్యాణి, నాగమ్మ, సీహెచ్.వినోద్, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో పలు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు.


ఉప్పుగుండూరులో పోలురాధా పోటీలు


రోజ్ స్టడీ సర్కిల్ విద్యార్థుల కోలాట ప్రదర్శన


సంతనూతలపాడులో ముగ్గుల పోటీలు

ట్రాక్టర్ రివర్స్ పోటీలలో 230 అడుగుల దూరాన్ని బండారుపల్లి శ్రీనివాసరావు 47 సెకన్లలో నడిపి ప్రథమ, పురిణి బాలచంద్ర ద్వితీయ, సందిపోగు బాలకృష్ణ తృతీయ స్థానంలో నిలిచారు. టగ్ఆఫ్ వార్ పోటీల్లో యలమంచిలి సాయి టీం మొదటి, మక్కెన సాయి ప్రదీప్ టీం రెండవ, గోగినేని చంద్రశేఖర్ టీం మూడవ బహుమతులు పొందారు. కనుమ పండుగ సందర్భంగా బుధవారం నాటుబండి పోలురాధా పోటీలను నిర్వహించారు. ఇక స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద రోజ్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్ తెలగతోటి శామ్యూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే ఈదు మూడిలో సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీకృష్ణ యాదవ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందించారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: మండలంలోని ప్రజలు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడులో యాదవసంఘం నాయకులు రావులపలి సురేష్, నలగట్ల వెంకటసుబ్బారావు, రామాంజనేయులు, వెంకటసుబ్బయ్య, ఆనంద్ తదితరుల ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు, లెమన్ స్పూన్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఇక పేర్నమిట్టలో ఐద్వా, జేవీవీ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో పలుపోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. మంగమూరులో జరిగిన పండుగ పోటీలను ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి హాజరై మాట్లాడారు. సంప్రదాయ క్రీడలను కాపాడుకోవాలని కోరారు.

కొప్పోలు అభివృద్ధికి కృషి

● ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట

ఒంగోలు(రూరల్), జనవరి15 (ఆంధ్రజ్యోతి): కొప్పోలు అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. కొప్పోలు అభివృద్ధికి రూ.2కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఒంగోలు నగరం కొప్పోలులో బుధవారం జరిగిన తెప్పోత్సవం వారు తిలకించారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ కొప్పోలురోడ్డులో గల కాలనీల అభివృద్ధికి తన సహకారం ఉంటుదన్నారు. కొప్పోలు గ్రామ అభివృద్ధి పేరుతో కరపత్రాలు వేయటం మంచి పద్ధతి కాదని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, టీడీపీ నాయకులు నడిపినేని భాస్కర్, కాట్రగడ్డ రఘుబాబు, దొడ్డ చంద్రశేఖర్, పారా రమేష్, పసల సుబ్బారావు, ఉన్నం నరసింహారావు, గద్దల శ్రావణ్, యు.నాగేశ్వరరావు, నిమ్మగడ్డ రమేష్, ఆవులమంద శ్రీనివాసరావు, కొప్పోలు నీటిసంఘం అధ్యక్షులు పోతినేని వేణుబాబు, బత్తినేని కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

మద్దిపాడు, జనవరి15(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, ఇనమనమెళ్లూరుకు చెందిన ఓ వృద్ధురాలు గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతుంది. ఇటీవల కాళ్లకు నీరువచ్చి నడవలేని స్థితికి చేరింది. దీంతో తాను ఎవరికీ భారం కాకూడదని భావించింది. తాను వాడే టాబ్లెట్లు అన్నీ కలిపి మింగింది. ఈ విషయం గమనించిన బంధువులు ఆమెను ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించింది. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు


గానం చేస్తున్న వినోద్‌కుమార్

ఒంగోలు కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస విశేష ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా శ్రీవారికి ఊంజల్ సేవను అర్చకులు శోభాయమానంగా నిర్వహించారు. అనంతరం దేవస్థాన ఆస్థాన విద్వాంసులు వినోద్‌కుమార్ ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు భక్తులను విశేషంగా అలరించాయి. అనంతరం స్వామివారికి తిరువీధి ఉత్సవాన్ని కన్నులపండుగగా నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. స్వర్ణ సుబ్బారావు బృందం కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ.రామకృష్ణారావు, ధర్మకర్తలు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి, జైశంకర్‌లు పర్యవేక్షించారు.

ఒంగోలులో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలి

● సీఎంను కోరిన ఎంపీ మాగుంట


చంద్రబాబుకు బొకే ఇస్తున్న రాఘవరెడ్డి, ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో విమానాశ్రయాన్ని త్వరగా ఏర్పాటు చేసే లా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. బుధవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎంపీ మాగుంట, ఆయన తనయుడు రాఘవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అనంతరం పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకువెళ్ళారు. ఒంగోలు ప్రజానీకం విమానాశ్రయంకోసం ఎదురుచూస్తున్నారని, దానిని వెంటనే ఏర్పాటు చేసి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టుతో పాటు మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా అంశాలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి ఆయా పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఎంపీ మాగుంట తెలిపారు.

ఉలిచి విద్యార్థులకు ఉచిత 'సివిల్' కోచింగ్

● నిర్వాహకులు బాలలత


బాలలతను సన్మానిస్తున్న గోపీచంద్, గ్రామస్థులు

ఒంగోలు(రూరల్), జనవరి15(ఆంధ్రజ్యోతి): ఉలిచి గ్రామానికి చెందిన సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి తన కోచింగ్ సెంటర్ ద్వారా ఉచితంగా శిక్షణ ఇస్తానని నిర్వాహకులు బాలలత పేర్కొన్నారు. ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో మంగళవారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు బాలలత హాజరై మాట్లాడారు. గ్రామానికి చెందన విద్యావంతులు ఆధార్‌కార్డుతో వస్తే సివిల్ సర్వీస్ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఉచితంగా ఇస్తామన్నారు. తనకు అత్తగారి గ్రామంలో ఘనంగా సన్మానం జరగటం ఎంతో ఆనందగా ఉందన్నారు. అనంతరం బాలలతను ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉలిచి అభ్యుదయ సేవాసమితి నాయకులు గార్లపాటి రామారావు, చుంచు నాగేశ్వరరావు, బొద్దులూరి రామారావు, రవీంద్ర, బోయిడి అంజనేయులు, చేజర్ల వెంకట్రావు, బొద్దులూరి హనుమంతరావు, నన్నపనేని రామాంజనేయులు, చుంచు ఆంజనేయులు, ఉప్పలపాటి శ్రీనివాసరావు. నాగరాజు, బోయిడి బాలకృష్ణ, శేషయ్య, కామేపల్లి శ్రీనివాసరావు, యర్రంనేని వెంకటశేషయ్య, యర్రంనేని నరసింహారావు, ఎర్రా అంజియ్య తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా తెప్పోత్సవాలు


అప్పాయికుంటలో స్వామివారి ఊరేగింపు


దావగూడూరులో సత్యకు అర్చకుడి ఆశీర్వాదం


పోతుల రామారావు పూజలు

ఒంగోలు(రూరల్), జనవరి15(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు ఊరచెరువులో బుధవారం సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణస్వామి, శ్రీప్రసన్నఆంజనేయస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్లను గ్రామస్థులు తెప్పోత్సవం కమనీయంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. అలాగే కొప్పోలు గ్రామ ఊరచెరువులో మంగళవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి, శివపార్వతులు, శ్రీభీమేశ్వరస్వామి వార్లకు వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం స్వామి వార్లను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళల కొలాటం ఆకట్టుకున్నది. అర్చకులు సమీర్‌కుమార్, రమేష్‌బాబు పూజలు చేశారు.

అప్పాయికుంటలో..

ఒంగోలు నగరం దశరాజుపల్లి రోడ్డులో గల అప్పాయికుంటలో శ్రీసీతారామలక్ష్మణ స్వాములవారి తెప్పోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ముందుగా శ్రీసీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను కమ్మపాలెం నుంచి అప్పాయికుంట వరకు కమ్మపాలెంవాసులు ఊరేగింపుగా తీసుకువచ్చి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీపంచముఖ ఆంజనేయస్వామివారిని భక్తులు దర్శించుని పూజలు చేశారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఉప్పుగుండూరులోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్ల తెప్పోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, పూజారి దీవి శ్రీధర్‌బాబు, రంగయ్య పంతులు తదితరులు పాల్గొన్నారు.

దావగూడూరులో..

జరుగుమల్లి: మండలంలోని దావగూడూరులో చెన్నకేశవస్వామి తెప్పోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఏపీ మారిటైమ్‌బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సత్యకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి హారతులిచ్చారు. సాయంత్రం గ్రామంలోని చెరువులో చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను తెప్పకట్టి ఉత్సవం జరిపారు.

- కొండపి మండలంలోని ముప్పవరం గ్రామంలో రామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం బుధవారం నిర్వహించారు. కె.ఉప్పలపాడులో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్ పాల్గొన్నారు.

టంగుటూరు మండలంలో..

టంగుటూరు: మండలంలోని టంగుటూరు, వల్లూరు, కొణిజేడు, పొందూరు గ్రామాల్లో బుధవారం తెప్పోత్సవం వైభవంగా జరిగింది. కారుమంచి గ్రామంలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. టంగుటూరులో జరిగిన తెప్పోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పాల్గొన్నారు. వల్లూరు చెరువులో ఈవేడుకలో మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, వల్లూరమ్మ దేవస్థానం ఈవో బి.రమేష్ పాల్గొన్నారు.

పల్లామల్లి అభివృద్ధికి సంపూర్ణ సహకారం

● ఎమ్మెల్యే బీఎన్, హైపర్ ఆది


బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్, హైపర్ ఆది

చీమకుర్తి, జనవరి15(ఆంధ్రజ్యోతి) : పల్లామల్లి అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందజేస్తామని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, ప్రముఖ సినీ ఆర్టిస్ట్ హైపర్ ఆది తెలిపారు. పల్లామల్లి గ్రామంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. టీడీపీ నాయకులు కరిచేటి హరికిషోర్, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలతో పాటు పలు సంప్రదాయ ఆటలపోటీలను నిర్వహించిన అనంతరం బహుమతి ప్రదానోత్సవ సభ జరిపారు. ఈ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ పల్లామల్లి గ్రామ అభివృద్ధికి గతంలో తాను చేసిన కృషిని గుర్తు చేశారు. గ్రామస్థులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అన్నింటిని పరిష్కరిస్తానన్నారు. గ్రామానికి చెందిన హైపర్ ఆది తెలుగు ప్రజల మనస్సులను గెలుసుకోవటం ద్వారా రాష్ట్రంలో ప్రముఖ వ్యక్తిగా గుర్తింపు పొందటం ఆనందదాయకంగా ఉందని చెప్పారు. గ్రామ అభివృద్ధికి తన సొంత నిధులను ఖర్చుపెట్టటం ఆదర్శప్రాయం అన్నారు. అనంతరం హైపర్ ఆది మాట్లాడుతూ తన సొంతూరి అభివృద్ధికి తాను సహకారం అందిస్తానన్నారు. డిప్యూటీ సీఎం ఉన్న తాను ఎంతో అభిమానించే పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి తన గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వజ్జా సుబ్బారావు, అన్నంనేని రాఘవయ్య, కరిచేటి వెంకటేశ్వర్లు, పారా గోపాలకృష్ణ, తేళ్ల వెంకటేశ్వర్లు, పారా శ్రీనివాసరావు, లింగయ్య, కూరాకులు కరుణకరరెడ్డి, రంపతోటి అంకారావు, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

హైపర్ ఆది సందడి..

ప్రతి ఏటా క్రమం తప్పకుండా సంక్రాంతి వేడుకలు జరుపుకోవటానికి పల్లామల్లికి విచ్చేసే జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది ఈ ఏడాది పండగ మూడురోజులపాటు గ్రామంలో ఉండి సందడి చేశారు. జిల్లా నలువైపుల నుంచి హైపర్ ఆదిని చూడటానికి పల్లామల్లికి పెద్దఎత్తున యువకులు విచ్చేశారు. ఆది తన చిన్ననాటి మిత్రులు, బంధువులతో ఉల్లాసంగా గడిపారు. పండగను స్వగ్రామంలో జరుపుకోవటం తనకు ఎంతో సంతృప్తిని కల్గిస్తుందని ఆది పేర్కొన్నారు.



గద్దలగుంటలోని పార్వేటకు తరలివచ్చిన ఉత్సవ మూర్తులు


పార్వేటకు విచ్చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

కనుమ సందర్భంగా బుధవారం ఒంగోలు గద్దలగుంటపాలెంలో పార్వేట నిర్వహించారు. వివిధ దేవాలయాల నుంచి దేవతామూర్తులను మేళతాళాల నడుమ ఉత్సవానికి తీసుకు వచ్చారు. భక్తులు కర్పూర నీరాజనాలు అర్పించారు.
- ఒంగోలు కల్చరల్

జోరుగా కోడిపందేలు

● పట్టించుకోని పోలీసు యంత్రాంగం


కొణిజేడులోని కొండల మధ్య జూదరుల కోలాహలం

సంతనూతలపాడు, జనవరి 15: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలో పలుచోట్ల కోడిపందేలు మంగళ, బుధవారాలు జోరుగా సాగాయి, ఓవైపు ఉన్నతాధికారులు కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా వారి ఆదేశాలను బేఖతారు చేసి నిర్వాహకులు దర్జాగా కోడిపందేలు నిర్వహించారు. మండలంలోని మాచవరం సమీపంలో చుట్టూ ఇనుపకంచె ఏర్పాటు చేసి బౌన్సర్లను నియమించుకుని కోడిపందేలు వేశారు. రూ.లక్షల్లో చేతులు మారినట్లు సమాచారం. ఇదేవిధంగా సంతనూతలపాడులోని ఎనికపాడు డొంకసమీపంలో ముగ్గువాగు వద్ద కూడా కోడిపందేలు జరిగాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన పలువురు డబ్బుల కట్టలను పట్టుకుని పందేలు కాస్తూ హడావుడి చేశారు.

టంగుటూరు: మండలంలోని కొణిజేడులో సంక్రాంతి సందర్భంగా వరుసగా మూడు రోజులు కోడిపందేలు హోరెత్తాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల నాడు కోడిపందేలు కొనసాగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి పందం రాయుళ్లు భారీగా కొణిజేడుకు తరలివచ్చారు. కొణిజేడు, సర్వేరెడ్డిపాలెం, యరజర్ల గ్రామాల పొలిమేరల్లో కోడిపందేలు నిర్వహించారు.

'సృష్టిలో తీయనిది' పుస్తకం ఆవిష్కరణ

సంతనూతలపాడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ నక్కా విజయరామరాజు జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో రచించిన సృష్టిలో తీయనిది అనే పుస్తకాన్ని బుధవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రచయితను అభినందించారు. కార్యక్రమంలో జానుడి సాహితి సంస్థ డైరెక్టర్ నూకతోటి రవికుమార్, టీడీపీ నాయకులు వి.వెంకటేశ్వరరెడ్డి, నూకతోటి రామారావు, బుజ్జి, రామక్రిష్ణ, వీరరాఘవులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ బరితెగింపు

● దారి కాచి అర్ధరాత్రి దాడి

ఒంగోలు క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఓ రౌడీషీటర్ ముఠా దారి కాచి దాడి చేసిన సంఘటన ఒంగోలు నగరం త్రోవగుంటలో మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటలకు జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక శ్రీరామకాలనీలో నివాసం ఉండే రౌడీషీటర్ మన్నె రామాంజనేయులును రెండేళ్ల క్రితం ఓ కేసులో హైదరాబాద్ పోలీసులు తీసుకెళ్ళారు. అదే సమయంలో శ్రీరామకాలనీలో నివాసం ఉండే దేవరకొండ రాజకుమార్ పోలీసులకు కారు డ్రైవర్‌గా వెళ్ళాడు. దీంతో రామాంజనేయులు అలియాస్ అంజీ అతనిపై కక్ష పెంచుకున్నాడు. అంతేకాకుండా అనేకమార్లు రాజకుమార్‌ను మేసేజ్‌ల ద్వారా బెదిరించాడు. తనను పోలీసులు పట్టుకునిపోవడానికి నువ్వే కారణమంటూ బూతులు తిట్టాడు. ఈక్రమంలో కనుమ పండుగకు కోళ్ళు తెచ్చుకునేందుకు రాజకుమార్, కుంబా రాములు బుధవారం రాత్రి ఇంటి నుంచి ఆటోలో చినగంజాం బయలుదేరారు. అదే అదునుగా భావించిన అంజీ తన ముఠాతో కారులో వారిని వెంబడించారు. త్రోవగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో కారు అడ్డుగా పెట్టారు. దీంతో ఆటోలో ఉన్న రాజకుమార్, రాములు బయటకు దిగడంతో రౌడీమూకలు వారిపై రాళ్ల దాడి చేశారు. ఆ సమయంలో అక్కడకు కొంతమంది చేరి వారిని వారించారు. దీంతో రామాంజనేయులు ముఠా రాజకుమార్‌ను చంపేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు గాయపడిన రాజకుమార్, రాములు రిమ్స్‌లో చేరి చికిత్స పొందుతు అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రౌడీషీటర్ రామాంజనేయులు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ముత్రం పోసి దాడి చేసిన కేసులో ప్రధాన నిందితుడు. ఒంగోలు తాలుకా ఎస్ఐ సందీప్ ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మద్దిపాడు, జనవరి15(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని టీడీపీ నాయకుడు అమృతలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నందిపాడులో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. పోకూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో మండవ ప్రతాప్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పలు ఆటలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రపనేని చంద్రశేఖర్‌రెడ్డి, మండవ లక్ష్మీనారాయణ, మన్నం శేషయ్య, తన్నీరు వెంకట్రామారావు, బోడెంపూడి సత్యనారాయణ, కోటయ్య పాల్గొన్నారు.

గ్రానైట్ యాజమానుల హర్షం

మద్దిపాడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గతంలో ఇచ్చిన పెండింగ్ బకాయిలు చెల్లించినందుకు గ్రానైట్ పరిశ్రమల యాజమాన్యం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. బుధవారం గుండ్లాపల్లి పారిశ్రామికవాడ గ్రానైట్ పరిశ్రమల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మండవ రత్నాకర్‌రావు మాట్లాడుతూ కరోనా సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో మూడు నెలలు పరిశ్రమలు మూసివేశారని, ఈ సమయంలో కనీసం కరెంటు చార్జీలు చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కానీ గత నాలుగు సంవత్సరాలు నిధులు జమ కాలేదని, కూటమి ప్రభుత్వం నిధులు విడుదలకు చొరవ తీసుకోవటంతో ఇటీవల బ్యాంకు ఖాతాలకు జమ అయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన చెప్పారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

మద్దిపాడు, జనవరి15 (ఆంధ్రజ్యోతి): తెల్లపాడు గ్రామంలో బుధవారం పొగాకు బ్యారన్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన కాట్రగడ్డ వెంకటశేషమ్మ బ్యారన్‌లో పొగ గొట్టం కింద పడి ఒక్కసారిగా మంటలు రేగాయి. దాదాపు పొగాకు మొత్తం కాలిపోయింది. రూ.4లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని ఒంగోలు అగ్నిమాపక అధికారి అంచనా వేశారు. బాధితురాలిని పొగాకు బోర్డు ఆదుకోవాలని టీడీపీ నాయకులు మల్లిపెద్ది బాలకృష్ణ కోరారు.

భక్తులకు మొక్కల పంపిణీ


మొక్కలను అందజేస్తున్న జయంత్‌బాబు

మద్దిపాడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మల్లవరం లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సంక్రాంతి పండుగ రోజు భక్తులకు 600 మొక్కలను పంపిణీ చేశారు. కొలచనకోట గ్రామానికి చెందిన గంటా సింగయ్య కుటుంబం రూ.50వేలు విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా శ్రీవారి వనం కమిటీ అధ్యక్షులు మార్నేని కృష్ణారావు ఆలయానికి విచ్చేసిన భక్తులకు మొక్కలను ప్రసాదంగా అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సింగయ్య కుటుంబ సభ్యులు గంటా శ్రీనివాసరావు, డాక్టర్ సుధీర్, డాక్టర్ నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, శ్రీవారి వనం కమిటీ గౌరవ అధ్యక్షులు కావూరి వాసు, కమిటీ అధ్యక్షులు మార్నేని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి రవి, మన్నం శ్రీనివాస్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు రాఘవ, ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు పాల్గొన్నారు.

విగ్రహాలకు భూమిపూజ

ఒంగోలు(రూరల్), జనవరి15(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలోని ఎస్సీకాలనీలో మంగళవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో చుంచు శేషయ్య, వై.వెంకటశేషయ్య, వై.నరసింహారావు, శింగయ్య, చుంచు రామకృష్ణ, బోయిడి బాలకృష్ణ, నాగరాజు, అడ్వకేట్ గల్లా గాంధీ, కాటి అంజయ్య, కావూరి సుధాకర్, డాక్టర్ విజయచంద్ర, కొమ్ము సుబ్బారావు, అంజయ్య, రమేష్, గరికపూడి కోటేశ్వరరావు, ఆనందరావు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిర్మూలించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య కోరారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన హేతువాది, స్వాతంత్ర్యసమరయోధుడు త్రిపురనేని రామస్వామి జయంతి సభలో ఆయన మాట్లాడారు. రామస్వామి తన సాహిత్యంతో మతాలలోని మూఢనమ్మకాల నిర్మూలనకు ఎంతో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంకే.బేగ్, డాక్టర్ బీరం సుందరరావు, ఉప్పుటూరి ప్రకాశరావు, జి.నరసింహారావు, చుంచు శేషయ్య, రంగారావు, వీరాంజనేయులు, కరవది సుబ్బారావు, ఎస్‌వీ.రంగారెడ్డి, గోరంట్ల పిచ్చయ్య, రిటైర్డ్ న్యాయమూర్తి వంగవోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రామస్వామికి ఘనంగా నివాళులర్పించారు.

కిరాణా షాపులో చోరీ

మద్దిపాడు, జనవరి15(ఆంధ్రజ్యోతి): మూసి ఉన్న కిరాణా షాపులో చోరీ జరిగిన సంఘటన కొలచనకోట గ్రామంలో బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం, కొలచనకోట గ్రామంలో గత పది సంవత్సరాలుగా సింగేపల్లి సీత కిరాణా షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 13న రాత్రి 9 గంటలకు షాపు మూసి మరుసటి రోజు ఉదయం వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులకొట్టి షాపులో రూ.15వేల నగదు, చిల్లర సరుకులు దొంగిలించినట్లు గుర్తించారు. ఈ మేరకు బుధవారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా బీచ్ కబడ్డీ పోటీలు


మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ఒంగోలు(రూరల్), జనవరి15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది గ్రామంలో ఎన్టీఆర్ క్రీడాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మహిళా బీచ్ కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను జిల్లా కబడ్డీ అసోషియోషన్ చైర్మన్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ రేవూరి మల్లికార్జునరావు ప్రారంభించారు. క్రీడాకారులను ఒంగోలు తాలూకా రూరల్ సీఐ జె.అజయ్‌కుమార్ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా క్రీడాకారులు క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ క్రీడాపరిషత్ వ్యవస్థాపకుడు శిరిగిరి రంగారావు, కబడ్డీ అసోషియోషన్ కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, కోశాధికారి దాసరి రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, అంచెపోగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు

విజేత ఎస్‌కేఎంసీసీ చెన్నై

బహుమతి ప్రదానం చేసిన సినీనటుడు రఘుబాబు, భ్రమర డైరెక్టర్ శైలారెడ్డి

మేదరమెట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండలం రావినూతలలో సంక్రాంతి కప్-2025 పోటీలు బుధవారం ముగిశాయి. ఎస్‌కేఎంసీసీ చెన్నై, సౌత్‌జోన్ సీసీ మధ్య జరిగిన ఫైనల్‌లో చెన్నై జట్టు విజయం సాధించింది. బహుమతి ప్రదానోత్సవంలో సినీనటుడు రఘుబాబు, శ్రీభ్రమర డైరెక్టర్ శైలారెడ్డి ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ ఏటా రావినూతల



విజేత జట్టుకు ఎస్‌కేఎంసీసీ చెన్నై జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న సినీనటుడు రఘుబాబు, భ్రమర టౌన్ షిప్ డైరెక్టర్ శైలారెడ్డి

స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు కీడాభిమానులందరినీ అలరిస్తున్నాయన్నారు. 34 ఏళ్ల క్రితం రూ.1,116 మొదటి బహుమతిగా ప్రారంభించిన సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు నేడు మొదటి బహుమతిగా రూ.3లక్షలు ఇచ్చే స్థాయికి తీసుకురావడంలో అసోసియేషన్ సభ్యులు కృషిని కొనియాడారు. గ్రామస్థులు, దాతల సహకారంతో అసోసియేషన్ సభ్యుల కృషి పట్టుదల, ఐకమత్యం వల్ల 6 కోట్ల రూపాయలతో స్టేడియం ఏర్పాటైందన్నారు. ప్రతి సంవత్సరం పోటీలలో పాల్గొనడానికి వచ్చే తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆటగాళ్లకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించడం ఎంతో శ్రమ, వ్యయంతో కూడుకున్న పని అన్నారు. శ్రీ భ్రమర డైరెక్టర్ శైలారెడ్డి మాట్లాడుతూ 32 సంవత్సరాల పాటు ఇంత పెద్ద టోర్నమెంట్‌ను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో ఎస్‌కేఎంసీసీ చెన్నై, సౌత్‌జోన్ సీసీ చెన్నై జట్ల మధ్య పోటీ జరిగింది. ఎస్‌కేఎంసీసీ చెన్నై జట్టు 25 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడోస్థానం కోసం జరిగిన పోటీలో ఎంఆర్‌సీసీ చెన్నై, జీడీసీఏ లెవెన్ గుంటూరు జట్లు పోటీ పడ్డాయి. జీడీసీఏ లెవెన్ గుంటూరు జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ఎంఆర్‌సీసీ చెన్నై జట్టు 14ఓవర్లలో 105 పరుగులకే ఆల్ అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీడీసీఏ లెవెన్ గుంటూరు జట్టు 13ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 108 పరుగులు సాధించింది. ఈ జట్టులోని మహిత్ కుమార్ 32 బంతుల్లో 4 ఫోర్లతో 42 పరుగులు సాధించాడు. ఈ జట్టులోని బౌలర్ సిద్ధార్థ, 3ఓవర్లు బౌలింగ్ చేసి 12 పరుగులు ఇచ్చి 3వికెట్లు తీశాడు. మరో బౌలర్ మనోజ్‌సాయి 4ఓవర్లు బౌలింగ్ చేసి 26 పరుగులు ఇచ్చి 3వికెట్లు తీశాడు. ఎంఆర్‌సీసీ చెన్నై జట్టుపై జీడీసీఏ లెవన్ గుంటూరు జట్టు 6వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ పోటీలకు అంపైర్‌లుగా శ్రీనివాస్, రాజా, స్కోరర్‌గా సాయిరాజ్ వ్యవహరించారు. మొదటి స్థానంలో నిలిచిన ఎస్‌కేఎంసీసీ చెన్నై జట్టుకు ట్రోఫీ, రూ.3లక్షల నగదు బహుమతిని సినీనటుడు రఘుబాబు, శ్రీభ్రమర టౌన్‌షిప్స్ డైరెక్టర్ శైలారెడ్డి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన సౌత్‌జోన్ సీసీ లెవెన్ చెన్నై జట్టుకు శైలారెడ్డి, తిలక్ ట్రోఫీ, రూ.2లక్షల నగదు బహుమతిని ప్రదానం మూడో స్థానంలో నిలిచిన జీడీసీఏ లెవెన్ గుంటూరు జట్టుకు ట్రోఫీ, రూ.లక్ష బహుమతిని శైలారెడ్డి, మోపర్తి నాగేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కారుసాల సుబ్బారావు, డాక్టర్ సుబ్బానాయుడు, ఆడిటర్ మురళీకృష్ణ, అద్దంకి ఆర్టీసీ డీఎం బెల్లం రామ్మోహనరావు, కారుసాల రామారావు, మోపర్తి నాగేశ్వరరావు, సాధినేని మస్తాన్‌రావు, తిలక్ పాల్గొన్నారు.

ముక్కలకు రెక్కలు



ఒక్కరోజులో పెరిగిన చికెన్.. మటన్ ధరలు

చికెన్ రూ.240నుంచి రూ.250 వరకు

రూ.1000 పలికిన కేజీ మటన్

అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా భారీగా అమ్మకాలు



ఒంగోలులో చికెన్ షాపు వద్ద కొనుగోలుదారులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 15 : కనుమ పండుగ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా చికెన్, మటన్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. పండుగ నేపథ్యంలో ఒంగోలుతోపాటు పట్టణాలు, మండలాలు, ముఖ్యమైన గ్రామాల్లో చికెన్ దుకాణాలు, మటన్ దుకాణాలు కిటకిటలాడాయి. జిల్లా వ్యాప్తంగా బుధవారం రోజునే సుమారు 30వేల కిలోలకు పైగా చికెన్, మరో 10వేల కిలోల మటన్ అమ్మకాలు జరిగి ఉంటాయని అంచనా. పండుగను ఆసరా చేసుకొని చికెన్, మటన్ వ్యాపారులు ధరలు పెంచి అమ్మకాలు చేశారు. దీంతో ప్రజానీకం అధిక ధరలకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పట్టించుకునేవారేరి?

పండుగ సీజన్‌ను ఆసరా చేసుకొని చికెన్, మటన్ ధరలు పెంచి విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రజలను ఏదో ఒక విధంగా దోపిడి చేసేందుకు అమ్మకాలు జరిగాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిన్న మొన్నటి వరకు అర కిలో, కిలో తీసుకునే కుటుంబాలు పండుగకు చుట్టాలు రావడంతో ప్రతి కుటుంబం ఎక్కువగా చికెన్‌ను కొనుగోలు చేశారు. ఒంగోలులోని కొత్త మార్కెట్ సెంటర్‌లో బుధవారం ఉదయం రద్దీ వాతావరణం నెలకొంది. వాహనాలు ఎక్కడిక్కడ నిలిపివేసి చికెన్ కొనుగోళ్లకు పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. ఇక పాతమార్కెట్‌సెంటర్, మంగమూరు రోడ్డు, కర్నూలు రోడ్డు, కొత్తపట్నం బస్టాండు, నెల్లూరు బస్టాండు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన ధరలు ఇలా...

- చికెన్ కిలోకు రూ.20 పెరగ్గా, మటన్ కిలోకు రూ.50, నాటుకోడికి కిలోకు రూ.100 పెంచారు.
- నిన్నమొన్నటి వరకు బ్రాయిలర్ కోడి చికెన్ ధర కిలో రూ.220 ఉండగా బుధవారం కిలోకు రూ.20 పెరిగి రూ.240కు చేరింది.
- నాటు కోడి పండుగకు ముందు కిలో రూ.600 ఉండగా ఏకంగా వంద పెంచి కిలో రూ.700లకు విక్రయించారు.
- మటన్ నిన్నమొన్నటి వరకు రూ.900 నుంచి రూ.950 ఉండగా పండుగ రోజున కిలో రూ.వెయ్యికి అమ్మకాలు చేశారు.



అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ఊరూవాడా సందడి.. కళకళలాడిన పల్లెలు

వైభవంగా స్వామి వార్ల తెప్పోత్సవాలు


టంగుటూరు మండలం వల్లూరు గ్రామ చెరువులో వల్లూరమ్మ తెప్పోత్సవం

ఒంగోలు కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మకర సంక్రాంతి, కనుమను జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆనంతోత్సాహంతో జరుపుకున్నారు. ఊరూరా సంబరాలు అంబరాన్నంటాయి. తెలుగువారి పెద్ద పండుగ కావడంతో ఇతర రాష్ట్రాలు, దేశాలలో ఉన్న జిల్లావాసులు స్వగ్రామాలకు చేరుకోవడంతో ప్రతి గ్రామంలో కోలాహలం కనిపించింది. చిన్న,పెద్ద దేవాలయాలకు ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి లోగిలీ ముత్యాల ముగ్గులతో మెరిసిపోయింది. కొత్త అల్లుళ్లు, బంధువుల రాకతో కళకళలాడింది.


మార్కాపురంలో చెన్నయ్య స్వామి పార్వేటలో భక్తులు(ఇన్‌సెట్లో) చెన్నయ్య

పార్వేట, తెప్పోత్సవాలు

కనుమ పండుగ సందర్భంగా బుధవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో స్వామివార్ల పార్వేట, తెప్పోత్సవాలు ఘనంగా జరిగాయి. ఒంగోలు గద్దలగుంటపాలెంలో వందేళ్లకు పైగా ఆనవాయితీగా వస్తున్న పార్వేట ఉత్సవంలో ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు. వివిధ దేవాలయాల నుంచి దేవతామూర్తులను మేళతాళాల నడుమ ఉత్సవం వరకు తీసుకు వచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు అర్పించారు. స్థానిక రంగారాయుడు చెరువులో శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి, శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామివార్ల తెప్పోత్సవం నిర్వహించగా, అప్పాయకుంటలో శ్రీసీతారామచంద్ర మూర్తి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. వీటిని చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఇక టంగుటూరు, కొప్పోలులో, కరవది మొదలైన ప్రాంతాలలో సైతం తెప్పోత్సవాలు ఘనంగా జరిగాయి.


కొప్పోలులో చెన్నకేశవస్వామి భీమేశ్వరస్వామి తెప్పోత్సవం


జరుగుమల్లి మండలంలోని దావగూడూరులో చెన్నకేశవస్వామి తెప్పోత్సవం


ఉప్పుగుండూరు ఊరచెరువులో వేణుగోపాలస్వామి తెప్పోత్సవం


గాంధీపార్కులో హాజరైన మహిళలు

శింగరకొండలో కనులపండువగా తెప్పోత్సవం

భవనాసిలో విహరించిన లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్లు

పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఈవో తిమ్మానాయుడు, పూజారులు

అద్దంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలో లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి తెప్పోత్సవం బుధవారం రాత్రి కనులపండువగా సాగింది. కనుమ సందర్భంగా శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భవనాసిలో ప్రత్యేకంగా అలంకరించి పడవ వద్దకు తీసుకొచ్చారు. పడవలో స్వామిని విహరింపచేశారు. పడవను విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తెప్పోత్సవాన్ని తిలకించారు. ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఈవో తిమ్మానాయుడు, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సిబ్బంది, రెండు దేవాలయాల పూజారులు పాల్గొన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై ఈవో తిమ్మాయనాయుడు, పూజారులు ప్రదక్షిణ చేశారు. అద్దంకి పట్టణంలోని పలు దేవాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అద్దంకి, మేదరమెట్ల, కొరిశపాడు స్టేషన్‌ల సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


భవనాసిలో ప్రత్యేకంగా అలంకరించిన పడవపై విహరిస్తున్న లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి

అయ్యప్పస్వామి దేవాలయం వద్ద జ్యోతి దర్శనం

శింగరకొండ సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద మకర సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయం ఎదురు అద్దంకి కొండపై ఏర్పాటు చేసిన జ్యోతి దర్శనాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించారు. దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, రామలింగేశ్వరరావు, తిరుపతిరెడ్డి, బాపయ్య, బుల్లెయ్య, అంజయ్య పాల్గొన్నారు.

కమ్మేసిన మంచు


ఎర్రగొండపాలెంలోని 565 జాతీయ రహదారిని మంచు కమ్మేసింది. బుధవారం ఉదయం 8 గంటల వరకు దట్టంగా మంచు పట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ మంచులోనే లైట్లు వేసుకొని వెళ్లారు.

- ఎర్రగొండపాలెం రూరల్, ఆంధ్రజ్యోతి

అనారోగ్యంతో డీఎస్పీ రత్తయ్య మృతి

పోలీసు లాంచనాలతో అంత్యక్రియలు

సూరవరపుపల్లిలో విషాదం

యద్దనపూడి/మార్టూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో డీఎస్పీ మద్దులూరి రత్తయ్య (53) మృతి చెందారు. ఆయన ప్రస్తుతం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో పనిచేస్తున్నారు. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం సూరవరపుపల్లికి చెందిన రత్తయ్య కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. గుంటూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన పార్థివదేహాన్ని సూరవరపుపల్లిలోని సొంతింటికి మంగళవారం తీసుకువచ్చారు. బుధవారం అంత్యక్రియలు జరిగాయి. రత్తయ్యకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. గ్రామంలోని రైతు కుటుంబానికి చెందిన మద్దులూరి ఇజ్రాయిల్ శాంతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో రెండో కుమారుడైన రత్తయ్య 2024 సెప్టెంబర్‌లో డీఎస్పీగా ప్రమోషన్ పొంది ప్రస్తుతం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన 1995లో నెల్లూరు జిల్లా వాకాడులో తొలిసారిగా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. 2009లో సీఐగా ప్రమోషన్ పొందిపలుచోట్ల పనిచేశారు. బుధవారం సాయంత్రం 3 గంటలకు చీరాల డీఎస్పీ మొయిన్ ఆధ్వర్యంలో యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి, హెడ్ క్వార్టరు నుంచి వచ్చిన 8 మంది రిజర్వ్ పోలీసులు, ఆర్ఎస్ఐలు, పలువురు పోలీసులు, విశ్రాంత పోలీసు ఉద్యోగులు ఆయనకు నివాళులర్పించారు. అనంతరం పోలీసు లాంచనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.


మద్దులూరి రత్తయ్య(ఫైల్)

డీఎస్పీ పార్థివదేహానికి పోలీసు లాంచనాలతో గౌరవవందనం చేస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్, ఎస్ఐ రత్నకుమారి

అవీ..ఇవీ



ప్రథమ విజేతకు వాషింగ్‌మిషన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

● ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య కాలనీలో 12, 13, 14 వార్డుల టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ముగ్గులను పరిశీలించిన న్యాయనిర్ణేతలు విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతిగా వాషింగ్ మెషిన్, రెండో బహుమతిగా గ్రైండర్, మూడో బహుమతిగా డ్రస్సింగ్ టేబుల్, నాలుగో బహుమతిగా మిక్సీ, ఐదో బహుమతిగా టేబుల్ ఫ్యాన్, ఆరో బహుమతిగా డిన్నర్ సెట్‌తోపాటు పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతులను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అందించారు. టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, నాలి కొండయ్య, కొప్పుల శ్రీనివాసులు, దొడ్డ రవణమ్మ, నందం శేఖర్, దూపాటి యలమంద, నాగూర్ వలి, బి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని సాజియాను అభినందించిన సీఐ

పొదిలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండోలో గోల్డ్‌మెడల్ సాధించిన షేక్ సాజియాను సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం అభినందించారు. గుంటూరు జిల్లా రేపల్లెలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీల్లో పొదిలికి చెందిన సాజియా బంగారు పతకం సాధించింది. దీంతో ఆయన సాజియాను అభినందించారు. బంగారు పతకం సాధించిన సాజియాను మాస్టర్ రాజు, ఆర్ఎంపీ వైద్యులు భరత్, కరిముల్లాబేగ్‌ను అభినందించారు.

వైభవంగా చెన్నయ్య పార్వేట మహోత్సవం

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామికి సంక్రాంతి సందర్భంగా మంగళవారం పార్వేట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు స్వామివారి మూలవిరాట్టుకు అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తిని శోభాయమానంగా అలంకరించారు. మోతకాపులు చెన్నకేశవ నామస్మరణల మధ్య ఆలయం నుంచి స్థానిక చెరువు సమీపంలోని సంక్రాంతి మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ అర్చకులు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు.అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు.


మార్కాపురంలో చెన్నకేశవుడి పార్వేట ఉత్సవం


కొమరోలు మండలం బాదినేనిపల్లిలో శ్రీ కోదండ రామస్వామి


కంభంలో వేంకటేశ్వర స్వామికి ఉత్సవం


కోనపల్లిలో తిరుమలనాథస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులు

గిద్దలూరులో..

గిద్దలూరు : గిద్దలూరు, రాచర్ల మండలాలలో ప్రజలు మకర సంక్రాంతి, కనుమ పర్వదినాలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు తమ ఇళ్లలో పూజలు నిర్వహించుకుని దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కొన్ని గ్రామాలలో మంగళవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. గిద్దలూరులో బుధవారం సాయంత్రం పారువేట ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రజలు ఉత్సవ మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పొదిలిలో..

పొదిలి : సంక్రాంతి పండుగను మండలంలో ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పలు వీధుల్లో గొబ్బెమ్మలను ఏర్పాటు చేసుకొని ప్రత్యేకంగా అలంకరించారు.

కనుమ వేడుకలు

కంభం : కంభం, అర్థవీడు మండలాల్లో మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగలను ప్రజలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముందు రంగవల్లులతో మహిళలు ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు. రెండు మండలాల్లోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.


భక్తులకు దర్శనమిస్తున్న బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారు

త్రిపురాంతకంలో..

త్రిపురాంతకం : సంక్రాంతి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళలు ఇళ్ల ముందు రంగవళ్లులతో అందమైన ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. వేంకటేశ్వరస్వామి ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, నాగస్వరూప ఎల్లమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారి ఆలయాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు.


పెద్దదోర్నాలలో పూజల్లో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

పెద్దదోర్నాలలో..

పెద్ద దోర్నాల : మండలంలో సంక్రాంతి వేడుకలు వైభోపేతంగా నిర్వహించారు.పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షధారులు పడి పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి చిత్రపటాన్ని ప్రత్యేక రథంపై ప్రతిష్ఠించి భక్తి గీతాలాపనలతో గ్రామోత్సవం గావించారు.

తిరుమలనాథస్వామి ఆలయంలో..

బేస్తవారపేట : కనుమ పండుగను పురస్కరించుకుని మండలంలోని కోనపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ తిరుమలనాథస్వామి దేవాలయంలో పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామి వారిని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులకు దేవస్థాన కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు వేదమంత్రాలతో, మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన స్వామి వారి గ్రామోత్సవాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులు ప్రారంభించారు. గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

కొమరోలులో..

కొమరోలు : మండలంలోని అన్ని గ్రామాల్లో మకర, కనుమరోజుల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలో శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పారువేట కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా మకరజ్యోతి దర్శనం

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానంలో మంగళవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మకర జ్యోతి దర్శనాన్ని వందలాది మంది భక్తులు వీక్షించారు. స్వామివారి ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి పడిపూజ నిర్వహించారు.

ఎర్రగొండపాలెంలో..

ఎర్రగొండపాలెం రూరల్ : మకర జ్యోతి సందర్భంగా స్థానిక అయప్ప స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలో స్వామి వారి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి ఆలయంలో మకర జ్యోతి హారతిని వెలిగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతానికి రైతు మృతి


మృతిచెందిన రైతు శివారెడ్డి

పొదిలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌షాక్‌కు గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని జువ్వలేరు గ్రామానికి చెందిన వెన్నపూస శివారెడ్డి తనపొలంలో విద్యుత్ మోటారు ఆన్‌చేసేందుకు వెళ్లాడు. విద్యుత్ తీగలు తగిలించే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురై శివారెడ్డి అక్కడే పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శివారెడ్డికి భార్య రమణమ్మ, కుమారుడు మల్లిఖార్జునరెడ్డి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నల్లమల ఘాట్‌రోడ్డులో కారు బోల్తా

● నలుగురికి గాయాలు

పెద్దదోర్నాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి):వేగంగా వస్తున్న కారు అదుపుతప్పిన బోల్తా పడిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఈఘటన నల్లమల ఘాట్ రోడ్డులో ఇష్ట కామేశ్వరి దేవాలయం వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో జంగారెడ్డి గూడేనికి చెందిన వరలక్ష్మి, మహేశ్, లక్ష్మి, సింధు, హర్షితకు స్వల్ప గాయాలయ్యాయి. జంగారెడ్డి గూడేనికి చెందిన వరలక్ష్మి కుటుంబ సభ్యులు శ్రీశైలం దైవదర్శనం కోసం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారిలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను సుండిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

కంభం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన భర్తను అరెస్టు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. బుధవారం కంభం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. కంభం పట్టణం సాదిమియా వీధిలోని అర్థవీటి శివరంగయ్య, భార్య అంజలి నివసిస్తున్నారు. అంజలి 5 సంవత్సరాలుగా స్థానిక చైతన్య స్కూలులో ఆయాగా పని చేస్తున్నది. భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అంజలి వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉందని అనుమానం పెంచుకున్న భర్త శివరంగయ్య ఈనెల 12వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కర్ర తీసుకుని తలపై బలంగా కొట్టడంతో అంజలి అక్కడికక్కడే మృతిచెందింది. ఆ వెంటనే పరారైన శివరంగయ్యను ఈనెల 14వ తేదీ సాయంత్రం కంభం చెరువుకట్ట రోడ్డులో ఉన్న అంకాలమ్మ గుడి వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును స్వల్పవ్యవధిలోనే పూర్తి చేసి నిందితుడిని అరెస్టు చేసిన కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు, హెడ్‌కానిస్టేబుల్ చెన్నయ్య, కానిస్టేబుళ్ళు బషీర్, వీరయ్యలను డీఎస్పీ నాగరాజు అభినందించారు.

నేడు, రేపు రామయోగయ్య స్వామి తిరునాళ్ల

పుల్లలచెరువు,జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపలమడుగు గ్రామపంచాయతీ చెన్నంపల్లి గ్రామంలో పొట్లపాటి రామయోగయ్య స్వామి తిరునాళ్ల గురు, శుక్రవారాల్లో జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. రామయోగయ్య స్వామి జీవ సమాధి అయిన రోజున ప్రతి సంవత్సరం పుల్లలచెరువు మండలం చెన్నంపల్లి, కురిచేడు మండలం పొట్లపాడు,ఎర్రగొండపాలెం మండలం నర్సాయిపాలెం, అయ్యంబొట్లపల్లి, త్రిపురాంతకం మండలంలోని ఎండోరివారిపాలెం గ్రామాల్లో రెండు రోజుల పాటు తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు.

నాగుపాము కలకలం

గిద్దలూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాచర్ల రోడ్డులోని వెంకటేశ్వర కాలనీలో నాగుపాము కలకలం సృష్టించింది. రోడ్లపై అటూ ఇటూ తిరుగుతుండడంతో ఆ ప్రాంతవాసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వీఆర్వో బాలాజీనాయక్ ఆధ్వర్యంలో రెస్క్యూటీమ్ సభ్యులు ప్రసాద్, శివ హుటాహుటిన అక్కడకు చేరుకుని నాగుపామును పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పట్టణంలోని చిన్నమసీదు కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన ఈకార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ షాన్వావలి, జమాయత్ ప్రతినిధులు షేక్ ఖదీర్‌బాషా, అక్బర్ అలీ, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు ఖాన్. ప్రవీన్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

పట్టణంలోని పీఆర్‌కాలనీ సంజీవిని అనాథ వృద్ధాశ్రమానికి సామాజిక కార్యకర్త కోటా సత్యనారాయణ నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా దాత సత్యనారాయణను ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ అభినందించారు.

ముగ్గుల పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీబజార్‌లో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించారు. గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకులు సూరె సురేంద్ర, జి.ప్రసాద్, పి.హరిబాబు, శ్రీకాంత్, సూరే ఉమాదేవి, జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

స్థానిక నెహ్రూబజార్‌లోని షిర్డీసాయిబాబా మందిరంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సుమారు 800 మంది పేదలకు మంగళవారం సీఐ సుబ్బారావు పేదలకు దుప్పట్లు అందజేశారు.

వైభవంగా సంక్రాంతి వేడుకలు

- కళకళలాడిన పల్లెలు
- కిటకిటలాడిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు
- పలుచోట్ల ఆటలపోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు

దర్శి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. పండుగ సందర్భంగా మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శి పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, రామాలయం, చలివేంద్ర కొండపై వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కనుమ పండుగ సందర్భంగా పశువులకు పూజలు చేశారు. నూతన ధాన్యంతో పిండివంటలు చేసుకొని కుటుంబసభ్యులు, బంధువులు సంతోషాలను పంచుకున్నారు. పండుగ సందర్భంగా దర్శి పట్టణంలోని వెలమవారి వీధిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సీఐ వై.రామారావు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక సందువారిపాలెంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు.

కనిగిరిలో..

కనిగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కనిగిరిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని గార్లపేట రోడ్డులోని శ్రీభ్రమరా టౌన్‌షిప్ సమీపంలో ఈకార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మహిళలు అత్యధిక సంఖ్యలో ముగ్గులు పోటీలు, స్కూటీ రైడింగ్, మ్యూజికల్ చైర్ గేమ్, స్పూన్‌గేమ్ క్రీడల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. అలాగే, చిన్నాపెద్దా తేడా మరిచి ఉల్లాసంగా గాలిపటాలు ఎగురవేసి ఆనందంగా గడిపారు. చిన్నారులు సైకిల్ రేస్‌లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మారెళ్ళ ఉమాకాంత్‌శర్మ, పైడిమర్రి ప్రసన్న, మామిడి శేఖర్, అంబాల కిశోర్, గురుస్వామి, వడ్డిపాటి వెంకట్, నవీన్, సంజీవ, తాళ్ళూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి: ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేస్తున్న యువకులు, చిన్నారులు



పామూరు: వాసవీమాత దేవస్థానం వద్ద జరుగుతున్న ముగ్గుల పోటీలు



తాళ్లూరు: నాగంబొట్లపాలెంలో నరసింహస్వామి కొండకు వెళుతున్న టీడీపీ మొక్కుబడి ప్రభ

దొనకొండలో..

దొనకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నీ గ్రామాల్లో మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. స్థానిక ఆనంద ఆశ్రమంలో పోలేరమ్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. కనుమ సందర్భంగా ఆశ్రమంలోని గోశాలలోని గోవులకు పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానంద స్వామి, భక్తులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక శ్రీవిజయాంజనేయ స్వామి దేవాలయంలో ధర్మకర్త బాలిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎస్సై విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. వీవీపురంలో టీడీపీ తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, నాయకులు వడ్లమూడి వెంకటాద్రి, మోడి ఆంజనేయులు, కుందుర్తి లక్ష్మణ్, షేక్ మస్తాన్, పోతిపోగు చెన్నయ్య, రాయని కుమార్ తదితరులు బహుమతులు అందజేశారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ముండ్లమూరులో నా ఊరే నా ఇల్లు కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, కబడ్డీ, లెమన్ స్పూన్ తోపాటు పలురకాల పోటీలు నిర్వహించారు. పసుపుగల్లులో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మారెళ్ళ ఉమామహేశ్వరం అగ్రహారం గ్రామాల్లో కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా పలు గ్రామాల్లోని దేవాలయాల వద్ద మూగ జీవాలకు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సాయంత్రం పలుగ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజులు కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి పండుగను జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట రంగవల్లులు వేశారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారరీత్యా పొరుగు ప్రాంతాలకు వెళ్లినవారు సొంత గ్రామాలకు చేరుకోవడంతో సందడి నెలకొంది. పీసీపల్లి, పెదయిర్లపాడు, వెంగళాయపల్లి, అలవలపాడు తదితర గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది సంక్రాంతి పండుగను పల్లె ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం కనిపించింది.





పామూరు: బంగారు తొడుగుతో అలంకరించిన వాసవీమాత, అయ్యప్ప స్వామివార్లు



పామూరు: అయ్యప్పస్వామి దేవస్థానంలో మకరజ్యోతిని దర్శించుకొంటున్న భక్తులు

కురిచేడులో..

కురిచేడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని మండలవాసులు వైభవంగా జరుపుకున్నారు. పట్టణాల్లో ఉంటున్నవారు పండుగకు స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు సందడిగా మారాయి. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పలుచోట్ల మహిళలకు ముగ్గు లపోటీలు యవకులకు ద్విచక్రవాహనాల పోటీలు, రైతులకు ట్రా క్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. కనుమ పండుగ రోజున ఎద్దుల పందాలు ఏర్పాటుచేశారు. ఒంగోలు గిత్తల బల ప్రదర్శన పోటీలు అందరిని ఆకట్టుకున్నాయి.

పామూరులో..

పామూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద నుంచి అయ్యప్పస్వామి విగ్రహానికి బంగారు తొడుగు ఆభరణాల పెట్టెలను దేవస్థాన చైర్మన్‌లు కావిటి సుబ్బయ్య, గుత్తి వెంకట రాజులు మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహిస్తూ అయ్యప్ప స్వామి దేవస్థానానికి తీసుకువచ్చారు. సాయంత్రం అయ్యప్పస్వామి దేవస్థానం పైభాగం, 18మెట్లపై మకరజ్యోతి ని వెలిగించడంతో భక్తులు పెద్ద ఎత్తున తిలకించి, స్వామి వారిని దర్శించుకొని శరణు వేడారు. బుధవారం అయ్యప్పలు ఇరుముడులు కట్టించుకొని శబరిమలైకు తరలివెళ్లారు. శబరి మలైకు తరలివెళ్లిన వారిలో దేవస్థాన ప్రధాన అర్చకులు చిమట పట్టాభిస్వామి, దేవస్థాన అధ్యక్షుడు కావిటి సుబ్బయ్య, గుత్తి రాజ ఉన్నారు. కార్యక్రమంలో కేవీ రమణయ్య, రాచూరి సురేష్, కంభాల రోశయ్య, వాయినేని మాల్యాద్రి, కటకం శివప్రసాద్, గుత్తి కొండయ్య, గద్దె రత్తయ్య, తదితరులు ఉన్నారు.

కాగా, సంక్రాంతి సందర్భంగా మండలంలోని పలు చోట్ల ఆటల పోటీలు నిర్వహించారు. కంభాలదిన్నె గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ ఎం.భీమానాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, మాజీ సర్పంచ్ గోళ్ల మాల్యాద్రినాయుడు, తెలుగురైతు మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, గోళ్ల రమణయ్య, ఏలూరి నరసింహారావు, గోళ్ల వీరబాబు, మల్లెల శ్రీనివాసులు, నిర్వాహకులు పాల్గొన్నారు. పట్టణంలోని వాసవీమాత దేవస్థానం వద్ద ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్‌లాంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులోగల దర్గా సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు.

పట్టణంలోని శ్రీవాసవీ కన్యాక పరమేశ్వరి దేవస్థానంలోని అమ్మవారిని బంగారం తొడుగు చీరతో అలంకరించారు. అలాగే, అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామిని కూడా బంగారు తొడుగుతో అలంకరించారు. బంగారు వస్త్రాలతో దర్శనమిచ్చిన దేవతామూర్తులకు భక్తులు పూజలు నిర్వహించారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూర్పు గంగవరంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు, మ్యూజికల్ చైర్, స్లోసైక్లింగ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. బొద్దికూరపాడులో శ్రీదేవిభూదేవి సమేత మాధవస్వామి ఆలయం, గంగాపార్వతీ సమేత సోమేశ్వరాలయంలో పూజలు జరిపి గ్రామోత్సవం నిర్వహించారు.

కార్యక్రమాల్లో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఎస్సై ఎస్.మల్లికా ర్జునరావు, వల్లభనేని సుబ్బయ్య, ఆంజనేయులు రామలక్ష్మయ్య , కొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు. బొద్దికూరపాడు స్వాముల ఊరేగింపులో పోలంరెడ్డి రమణారెడ్డి, సుబ్బారెడ్డి, వీరనాగిరెడ్డి, రాఘవరెడ్డి, ఎస్.అంజిరెడ్డి, పులి బాలకోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, నాగంబొట్లపాలెం గ్రామంలో టీడీపీ సీనియర్ నేతలు పిన్నిక రమేష్, పాశం సూరిబాబు ఆధ్వర్యంలో మొక్కుబడి ప్రభ ఏర్పాటుచేశారు. ఈ ప్రభతో టీడీపీ శ్రేణులు నరసింహస్వామి కొండకు తరలివెళ్లారు. వైసీపీ నాయకులు అనీల్‌రెడ్డి, చిమలా సుబ్బారావు ఆధ్వర్యంలో ఒకటి, కొమ్మిరెడ్డి రాజా ఆధ్వర్యంలో మరొకటి విద్యుత్ ప్రభను ఏర్పాటుచేశారు.

సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన వసతులు

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో ఏ విద్యార్థి చదువు మధ్యంలో ఆగకుండా చూడాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కంచర్లవార్లిపల్లి హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా హాస్టల్ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లోని చాలామంది పేదవర్గాల వారు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ప్రోత్సాహం లేకపోవడంతోపాటు వారి కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడి ఉండటమే అందుకు కారణమన్నారు. ప్రతి గ్రామంలో ఏఏ కుటుంబాల్లో చిన్నారులు చదువుకు దూరంగా ఉంటున్నారో గుర్తించి వారిని బడిబాట పట్టించేలా అధికారులు మరింత చొరవ చూపాలని కోరారు. విద్యనభ్యసించటానికి ఆర్థిక ఇబ్బందులు కారణంకాకూడదనే ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేస్తున్నట్టు చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పనతో పాటు నాణ్యమైన భోజన వసతిని కల్పించి పేదవర్గాల వారిని విద్యాపరంగా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. కనిగిరి ప్రాంతలో హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను త్వరతిగతిన పరిష్కరిస్తామన్నారు. హాస్టల్‌లో మెరుగైన భోజనవసతితో పాటు సౌకర్యాల కల్పనకు కావాల్సిన నిధులు సమీకరణకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు చెప్పారు. కొన్ని హాస్టళ్లను పరిశీలించినపుడు విద్యార్థులకు మెరుగైన వసతులు లేకపోవటం బాధ కల్గించిందన్నారు. తనశక్తి మేర అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. తాను సంకల్పించిన ప్రతి కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి చేయూత ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, పోతు కొండారెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, వీర్ల కిషోర్, కొత్తూరు రవి, వడ్డెంపూడి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌స్థాయి కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు

కనిగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో డివిజన్‌స్థాయి కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. కార్యాలయాల ఏర్పాటుకు కంభం, పొదిలి రోడ్డులలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను మంగళవారం తహసీల్దార్ రవితో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌స్థాయి కార్యాలయాలైన విద్యుత్, రెవెన్యూ, పోలీస్, మున్సిపాల్టీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ వంటి ప్రభుత్వ డివిజన్‌స్థాయి కార్యాలయాలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. అందుకుగాను పొదిలి రోడ్డులోని సూరాపాపిరెడ్డి నగర్ ఎదురుగాఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూముల వివరాలను తయారుచేయాలని తహసీల్దార్‌కు సూచించారు. అలాగే, కంభం రోడ్డులోని సబ్‌స్టేషన్ సమీపంలోని అసైన్డ్ భూములు, కందుకూరు రోడ్డులోని కస్తూర్బాస్కూల్, కొత్తూరు, చాకిరాల, డిగ్రీ కళాశాల సమీపంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలు అందజేయాలని కోరారు. ప్రజావసరాల దృష్ట్యా అందరికి అనువుగా ప్రభుత్వ డివిజన్‌స్థాయి కార్యాలయాల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి త్వరతిగతిన నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా కార్యాలయాల నిర్మాణాలకు ప్రణాళికాబద్ధంగా నిధుల కేటాయింపునకు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళి అభ్యర్థించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారప రెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



పొదిలి రోడ్డులోని ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర ఉగ్ర

కాలువలు ఇలా.. చివరి భూములకు నీరెలా..!



అయోధ్య నగర్ - ఈదర మధ్య సాగర్ కాలువపై దెబ్బతిన్న బ్రిడ్జి




చిల్ల చెట్లతో మూసుకు పోయిన తమ్మలూరులో మైనర్ కాలువ

ముండ్లమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి, రజానగర్ మేజర్ల కాలువలపై నిర్మించిన బ్రిడ్జీలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఎప్పుడు కూలిపోతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాలువలు కూడా చిల్లచెట్లతో చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో చివరి భూములకు నీరు సక్రమంగా అందక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మోదేపల్లి మేజరుపై ఈదర - అయోధ్య నగర్ మధ్య మోదేపల్లి మేజరుపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. రాత్రుల సమయాల్లో సాగర్ కాలువ పై ఉన్న బ్రిడ్జిని గమనించక ప్రమాదవశాత్తు వాహన చోదకులు కాలువల్లో పడి దెబ్బలు తగిలిన సందర్భాలు ఉన్నాయి. కొటికలపూడి దగ్గర బ్రిడ్జి, శంకరాపురం వద్ద కల్వర్టు, వేముల వద్ద ఉన్న కల్వర్టు దెబ్బతిన్నాయి.

కాలువల పరిస్థితి ఇలాఉంటే.. మోదేపల్లి, రజానగర్ పరిధిలో మేజరు కాలువలు, మైనరు కాలువల్లో చిల్లచెట్లు పెరిగిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. మోదేపల్లి మేజరు పరిధిలో రామకృష్ణాపురం, శంకరాపురం, సుంకరవారిపాలెం కాలువలు అధ్వానంగా నాయుడుపాలెం, తమ్మలూరు, వేములబండ, పోలవరం, తూర్పుకంభంపాడు పరిధిలో మైనర్ కాలువలు చిల్లచెట్లతో పూడిపోయాయి. రజానగరం మేజరు పరిధిలో సింగనపాలెం, రెడ్డినగర్, పసుపుగల్లు, ముండ్లమూరు, చంద్రగిరి మైనర్ కాలువలు చిల్లచెట్లతో మూసుకు పోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో సాగర్ కాలువల ఆధునీకరణ గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మేజరు, మైనర్ కాలువలు పూర్తిగా చిల్లచెట్లతో మూసుకుపోవటంతో రైతులకు శాపంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని సక్రమంగా నీరందేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తా

- కంచుమాటి శ్రీనివాసరావు, మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్



శ్రీనివాసరావు

మోదేపల్లి మేజరు పరిధిలో అయోధ్యనగర్ - ఈదర్ మధ్య సాగర్ కాలువపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడలూ దెబ్బతిన్నాయి. మేజరు పరిధిలో కల్వర్టులు, మేజరు, మైనర్ కాలువల్లో చిల్లచెట్లు దట్టంగా పెరిగిపోవడంతో చివరి భూములకు సరిగా నీరు చేరటంలేదు. ఈసమస్యను కుడి కాలువ ప్రాజెక్టు చైర్మన్ పులుకూరి కాంతారావు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో నిధులు మంజూరు చేయించి రైతుల ఇబ్బందులు తొలగిస్తాం.

భక్తిశ్రద్ధలతో నారాయణ స్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో మకర సంక్రాంతి సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి ఈవో నరసింహాబాబు ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, ఎండోమెంట్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా పామూరులోని మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం స్వామి వార్లకు పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఈవో నరసింహాబాబు తెలిపారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణం చేస్తున్న వేదపండితులు

తాళ్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరం కోదండ రామస్వామి దేవాలయంలో మంగళవారం గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గత నెలరోజులుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. పదిమంది దంపతులు కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి వారికి విఘ్నేశ్వరపూజ, అష్టోత్తరనామ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గుంటిగంగ బ్రాహ్మణ అన్నదాన సత్ర అధ్యక్షురాలు యల్లాప్రగడ తోయజాక్షి లక్ష్మీసుందరి, శివరామకృష్ణప్రసాద్(కన్నయ్య), దీక్షితులు పంతులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయకమిటీ వారు భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి నుంచి రామయోగి స్వామి తిరునాళ్ల

కురిచేడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లపాడు గ్రామంలో గుత్తికొండ రామయోగిస్వామి తిరునాళ్ల గురువారం నుంచి మూడురోజులపాటు వైభవంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విరివిగా తరలివస్తారు. రామయోగి సజీవ సమాధి అయిన రోజును పురస్కరించుకుని భక్తులు ఉత్సవాలు జరుపుకుంటారు. ఇదేరోజున త్రిపురాంతకం మండలంలోని ఎండూరివారిపాలెం, యర్రగొండపాలెం మండలంలోని నరసాయపాలెం, గుంటూరు జిల్లాలోని నూజెండ్ల తదితర ప్రాంతలలో స్వామివారి పేరుతో తిరునాళ్ళు నిర్వహిస్తుంటారు. కాగా, భక్తులు ఇచ్చిన విరాళాలతో దేవాలయం పరిసరాలలో వారి సౌకర్యార్థం గదులు ఏర్పాటు చేశారు. చీమకుర్తికి చెందిన భక్తుడు ఆలయాన్ని గ్రానైట్ రాయితో తీర్చిదిద్దాడు. మరిన్ని అభివృద్ధి పనులను త్వరలో చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. తిరునాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ పర్సనల్ మేనేజరు, ధర్మకర్త శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటుచేస్తున్నట్టు సమాచారం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం

దొనకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహనాయునిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త జొన్నలగడ్డ జయరావు(67) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ ఆదేశాల మేరకు మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. మృతి చెందిన జయరావు కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. కుటుంబసభ్యులను పరామర్శించి అధైర్యపడొద్దన్నారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సహకారంతో ఎటువంటి కష్టం వచ్చినా తాము తోడుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ సుభాని, సింగమనేని హనుమంతు, పురుషోత్తం సత్యానందం, బత్తుల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల కోడి పందేలు

పామూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది సంక్రాంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గతంలో ఎన్నడూ జరగనివిధంగా కోడి పందేలు నిర్వహించారు. వీటిపై పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. సంప్రదాయ సంక్రాంతి పేరుతో మండలంలోని నర్రమారెళ్ల, పడమట కట్టకిందపల్లిలోని డీవిపల్లి, తదితర గ్రామాల్లో నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో బహిరంగంగా పందెపు కోళ్ల కాలు దువ్వాయి. కోడి పందేలను తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివెళ్లారు. బహిరంగంగానే అధికార, విపక్ష పార్టీలకు చెందిన పలువురు నాయకులు పందెం కోళ్లతో సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఈవిషయంపై ఎస్ఐను వివరణ కోరగా పండుగకు సిబ్బంది సెలవులపై వెళ్లారని తెలిపారు. తగినంత సిబ్బంది లేకపోవడంతో దృష్టి సారించలేకపోయామన్నారు.

నాగంబొట్లపాలెంలో టీడీపీ ఫ్లెక్సీ చించివేత



నాగంబొట్లపాలెంలో చించివేసిన టీడీపీ ఫ్లెక్సీ

తాళ్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా నాగంబొట్లపాలెంలో గ్రామ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో టీడీపీ యువనాయకులు వేడికోల సుధాకరరెడ్డి, వేడికోట నరసింహారెడ్డి, కొమ్మిరెడ్డి కోటిరెడ్డిలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. ఫ్లెక్సీలోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ ఫొటోలను మాత్రమే చించివేయటం చర్చనీయాంశమైంది. పోలీసులు ఆకతాయిలపై దృష్టి సారించి ఇటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

శ్మశానానికి వెళ్లేందుకు కష్టాలు



మృతదేహం ఖననానికి శ్మశానానికి వాగులో తీసుకువెళ్తున్న బంధువులు

ముండ్లమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో శ్మశానానికి వెళ్ళేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామంలో ఎవరైనా హిందువులు చనిపోతే వారిని పూడ్చి పెట్టేందుకు గాని, ఖననం చేసేందుకు గాని నడుము లోతు నీరుఉన్న వాగు దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామానికి చెందిన బిజ్జం పిచ్చమ్మ బుధవారం మృతిచెందారు. ఆమెను ఖననం చేయటానికి బంధువులంతా గ్రామానికి దూరంలో ఉన్న శ్మశానానికి తీసుకెళ్లారు. మధ్యలోఉన్న పెద్ద వాగులో నడుములోతు నీరు ఉంది. ఆనీటిలో మృతదేహన్ని తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగుపై బ్రిడ్జి ఏర్పాటుచేసి శ్మశానికి వెళ్ళే కష్టాలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.





తూర్పుపాలెంలో ఐదు పందాలు గెలిచిన మంత్రిపాలెం వాసులకు బుల్లెట్‌ను బహూకరిస్తున్న సినీ నిర్మాత నాగవంశీ,అనగాని శివప్రసాద్

తెలంగాణ నుంచి వచ్చి పందేలు

భోగి మొదలు కనుమ పండుగ రోజయిన బుధవారం వరకు బాపట్ల జిల్లావ్యాప్తంగా వివిధ జూదక్రీడల ద్వారా దాదాపు రూ.60కోట్లు చేతులు మారినట్లు తెలుస్తోంది. దాదాపుగా అందరికీ కనబడేలా ఆయా ప్రాంతాల నడి బొడ్డున సినీ సెట్టింగ్‌లను తలదన్నే రీతితో జిల్లాలో 9 వరకు బరులను ఏర్పాటుచేశారు. ఇందులో ప్రధానంగా పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం, చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలోని బరులకు సెలబ్రిటీల తో పాటు సామాన్య జనం పోటెత్తారు. తెలంగాణ నుంచి పెద్దఎత్తున పందేల కోసం రాగా దాదాపుగా రూ.35కోట్ల వరకు వారిదే అన్నట్లు సమాచారం. గతంలో వీరిలో ఎక్కువ శాతం పందేల కోసం భీమవరం బాట పట్టేవారు. కానీ ఈ దఫా అదే స్థాయిలో మంతెనవారిపాలెంలో బరిని ఏర్పాటుచేయడంతో ఇక్కడికి పోటెత్తారు.

ఐదు పందేలు కొడితే.. బుల్లెట్

మంతెనవారిపాలెం, తూర్పుపాలెంలోని బరుల నిర్వాహకులు రకరకాల ఆఫర్లతో పందెం రాయుళ్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. వరుసగా ఐదు పందేలు గెలిస్తే బుల్లెట్‌ను బహుమతిగా ప్రకటించారు. రెండు బరుల్లో కలిపి ముగ్గురి వరకు ఈ కానుకను గెలుచుకున్నట్లు తెలుస్తోంది. వరుసగా ఐదుసార్లు పందెం గెలవడంతో మంత్రిపాలేనికి చెందిన ప్రతాప్‌కు బుల్లెట్‌ను చిత్రనిర్మాత సూర్యదేవరనాగవంశీ, అనగాని శివప్రసాద్‌లు అందజేశారు.

రాత్రింబవళ్లు సందడే సందడి..

కొల్లూరు: కొల్లూరు మండలంలోని క్రాప అడ్డరోడ్డు, అనంతవరం గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన కోడి బరుల వద్ద నాలుగు రోజులుగా కోలాహల వాతావరణం నెలకొంది. బరుల వద్ద గుండాట, నెంబర్ల ఆట, కోతముక్క, తదితరాలను అందుబాటులోకి తేవడంతో ఆ ప్రాంతం జూదరులతో సందడి సందడిగా మారింది. రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు కోడి పందేలు జరగ్గా జూద క్రీడల మాట సరేసరి. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు కోడి పందాలు జరిగాయి. కోతముక్క, పేకాట మాత్రం రాత్రింబవళ్ళు సాగినట్లు సమాచారం. గురువారం కూడా కోడి పందేలు సాగుతాయని నిర్వాహకులు మైకుల ద్వారా ప్రచారం చేయడం గమనార్హం.

కోడి రూ. కోట్లు



- ఆపేదెవరన్నట్లుగా పందేలు
- రాత్రి వేళలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లోనూ..
- అధికారం అండతో రెచ్చిపోయిన నేతలు
- వరసగా ఐదు పందేలు గెలిచిన వారికి బుల్లెట్
- పోలీసుల ప్రేక్షకపాత్ర.. చేతులు మారిన నగదు

(బాపట్ల, అద్దంకి, బల్లికురవ, తెనాలి - ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంప్రదాయాల ముసుగులో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కోడిపందేలను యథేచ్ఛగా నిర్వహించారు. కత్తి కట్టిన కోళ్ల కాలు దువ్వగా రూ.లక్షలు చేతపట్టి సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా జూదరులు తరలివచ్చారు. కోడిపందాలు, పేకాట, కోతముక్కాట, నెంబర్లాట అడ్డుఅదుపు లేకుండా కొనసాగాయి. మూడు రోజులమీద కోడిపందాలు, కోతముక్కాట మీద సుమారు రూ.200 కోట్లు బెట్టింగ్‌లు జరిగి ఉంటాయని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వీఐపీ బరిలో లక్ష నుంచి రూ.5 లక్షల పందేలు జరిగాయి. అధికార పార్టీ నేతల అండ.. కన్నెత్తి చూడని పోలీసులు.. బరి తెగించిన నిర్వాహకులతో కోట్లలో నగదు చేతులు మారాయి. బరుల వద్ద కోతముక్క, నెంబర్లాటలను నిరాటంకంగా నిర్వాహకులు జరిపించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం కనుమ పండుగ సందర్భంగా బుధవారం విచ్చలవిడిగా కోడిపందాలు జోరుగా సాగాయి. భోగి పండుగ ముందు రోజు అరెస్టులు.. బరుల తొలగింపులతో హడావుడి చేసిన పోలీసులు ఆ తర్వాత పత్తాలేకుండా పోయారు. ఫ్లెక్సీలు కట్టి.. మైకు ప్రచారాలతో పందేలపై నిర్వాహకులు హోరెత్తించినా మూడు రోజులు పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. నేరుగా ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలే బరుల వద్ద ఉంటూ పందేలను పర్యవేక్షించారు. ఎక్కడయినా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించిన పోలీసు అధికారులకు తీర ప్రాంత గ్రామాలతో పాటు, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు పల్లెల నడిబొడ్డున ఏర్పాటు చేసిన బరులు మాత్రం కనిపించక పోవడం విశేషం. బరులకు సమీపంలో జూదరుల వాహనాలను క్రమబద్ధీకరించడానికి పోలీసులు పరిమితమయ్యారు. ఇక బరుల వద్ద వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలతో పాటు సామాన్య జనం పందేలను వీక్షించడానికి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బరిలోకి ప్రవేశించాలంటే ట్యాగ్‌లు, టోకెన్లు అందజేసి మరీ పందేలను నిర్వహించారు. బరుల వద్ద జూదరుల కోసం నగదుకు ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా ఏటీఎం తరహా ఏర్పాట్లు కూడా చేశారు. నేతల అండతో దర్జాగా బరులు ఏర్పాటు చేసిన నిర్వాహకులు బరుల వద్దకు ప్రవేశించే విషయంలో బౌన్సర్లతో భద్రతను కట్టుదిట్టం చేసి ఈ దఫా అత్యంత పకడ్బందీగా జూద క్రీడలను నిర్వహించారు. లక్ష రూపాయల చొప్పున పందేలు నడిచాయి. అడిగేదెవరూ.. ఆపేదెవరు అన్నరీతిలో లక్షలు దండుకున్నారు. కొన్ని బరుల వద్ద రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. ప్రభుత్వం మారినా గతంలో కన్నా హంగు, ఆర్భాటాలు పెంచి మరీ జూదశిబిరాలు దిగ్విజయంగా నిర్వహించారు. పేకాట కూడా స్థాయిని బట్టి లక్ష నుంచి ఐదు లక్షల వరకు నడిచినట్లు సమాచారం. బరుల వద్ద కార్ల పార్కింగ్‌కు రూ.200, బైక్ పార్కింగ్‌కు వంద ఇలా అందిన కాడికి దోచేశారు. బరుల వద్దే పుష్కలంగా మందుతో పాటు మాంస పదార్థాలను కూడా అందుబాటులో ఉంచారు. మొత్తంమీద జూదరులకు బరుల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మండల స్థాయి కూటమి నేతలు కొందరు పందేలను లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారని పార్టీలోని వక్తులే బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బరుల వద్దే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి అన్ని బ్రాండ్లతో పాటు, బీర్లు లభించును అని బోర్డులను ఏర్పాటు చేసిన నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేశారు. బ్రాండ్‌ను బట్టి క్వార్టర్ బాటిల్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు, ఫుల్ బాటిల్‌కు రూ.300కుపైనే అధికంగా వసూలు చేశారు. అయినా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు.



కొల్లూరు: క్రాప అడ్డరోడ్డు వద్ద కోడి పందెం బరిలో ఉన్న పందెం రాయుళ్ళు



కొల్లూరు: బరివద్ద సాగుతున్న జూద క్రీడలు



అద్దంకి: మల్లాయపాలెం వద్ద కోడి పందెం వద్ద గుమిగూడిన పందెరాయుళ్లు, ప్రజలు



అద్దంకి: బల్లికురవ మండలం మల్లాయపాలెం వద్ద పందెంలో తలపడుతున్న కోళ్లు

తీరంలో జోరుగా..

బాపట్ల జిల్లా పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో 8 బరులతో కోడిపందాలు జోరుగా నిర్వహించారు. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో యథేచ్ఛగా కోడి పందేలు జరిగాయి. తెలంగాణ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో జూదరులు తరలిరావడంతో తూర్పుపాలెం బరులు కిటకిటలాడాయి. సంక్రాంతి పండుగ రోజున మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్, మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, సినీనిర్మాత సూర్యదేవరనాగవంశీ తదితరులు పందేలను వీక్షించారు. బరుల సమీపంలో కోతముక్క, పేకాటకు ప్రత్యేక గుడారాలను వేసి హైటెక్ క్లబ్ తరహాలో ఏర్పాటు చేశారు.

దుస్తులు, స్వీట్లు పంపిణీ

నగరం మండలం ఏలేటిపాలెం సపోటతోటల్లో వైసీపీకి చెందిన ఓ వ్యక్తి పేకాట, కోతముక్క, యథేచ్ఛగా రెండునెలలుగా కొనసాగిస్తున్నాడు. అయితే సంక్రాంతిని పురస్కరించుకుని దుస్తులు, కేజీ స్వీటు బాక్సులను జూదరులకు పంపిణీ చేసి ఉత్సాహపరిచారు. కనుమపండుగ రోజున నాటుకోడి, చిల్లిగారె, మటన్ థమ్‌బిర్యాని అందజేశారని సమాచారం.

బరితెగింపు..

అద్దంకి ప్రాంతంలో గతంలో గుట్టుచప్పుడుగా సాగిన కోడి పందేలు.. ఈ ఏడాది బరి తెగించి నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలో నాలుగు రోజులుగా కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. బల్లికురవ మండలం మల్లాయపాలెం, సంతమాగులూరు మండలం చవిటిపాలెం వద్ద పందేలు బహిరంగంగానే జరిగాయి. ఈ పందేల్లో సుమారు రూ.50 లక్షలకు పైగానే చేతులు మారినట్లు అంచనా. అద్దంకి, చిలకలూరిపేట, నరసరావుపేట నియోజకవర్గాల నుంచి జూదరులు కోళ్లతో బరుల వద్దకు వస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది. బుధవారం స్థానికులు ఎస్పీ కార్యాలయానికి సమాచారం ఇవ్వగా చివర్లో పోలీసులు వచ్చి హడావుడి చేశారు. పోలీసుల రాకను ముందే తెలుసుకున్న జూదరులు, ప్రేక్షకులు సమీపంలో ఉన్న కొండ పైకి, ఇతర ప్రాంతాలకు పారిపోయారు.



రేపల్లె: తూర్పుపాలెంలో జోరుగా నెంబర్లాట



కొల్లిపరలో కోడి పందేలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో జోరుగా కోడిపందేలు



సంబరాలు.. సందళ్లు



పర్చూరు అన్నంబొట్లవారిపాలెంలో బండ లాగుతున్న ఒంగోలు జాతి గిత్తలు



పర్చూరు: పోటీలో ఢీ అంటున్న పొట్టేళ్లు

- ఊరూరా వేడుకగా సంక్రాంతి
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ

బాపట్ల, పర్చూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పండుగతో పల్లెలు మురిశాయి. సంక్రాంతి సంబరాలతో ఉరూవాడా సందడి నెలకొంది. ఉద్యోగ, వ్యాపార ఇతర వృత్తులు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి వేడుకలు నిర్వహించుకున్నారు. చిన్నారులు, విద్యార్థులు గాలిపటాలు ఎగరేసి సందడి చేశారు. పలుగ్రామాల్లో సంక్రాంతి సంబరాలను మూడు రోజులపాటు కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఆటపాటలు, సంస్కృతిక కార్యక్రమాలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి, కనుమ సందర్భంగా ఉదయాన్నే ఇళ్లముంగిట రంగవల్లులు వేసి, గొబ్బిళ్లను అమర్చి అందంగా తీర్చిదిద్దారు. కొత్తపంట బియ్యంతో పొంగలి సిద్ధం చేసి నైవేద్యం సమర్పించారు. కనుమనాడు రథం ముగ్గులతో ముంగిళ్లను తీర్చిదిద్దారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలైన మహిళలకు బహుమతులను అందజేశారు. ఎడ్ల పందేలు, క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీల్లో యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎక్కడికక్కడ యువత ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్దఎత్తున జరిగా యి. మకర సంక్రాంతి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవతా మూర్తుల ఊరేగింపులు, తెప్పోత్సవాలు ఘనంగా జరిగాయి. గుంటూరు, నరసరావుపేట, బాపట్ల తదితర ప్రాంతాల్లో అయ్యప్పస్వామి దేవాలయాల్లో మకరజ్యోతిని భక్తులు దర్శించు కున్నారు. కనుమ సందర్భంగా రైతులు పశువు లను అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేశారు.

- పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలోని గొట్టిపాటి హనుమంతురావు మెమోరియల్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన హోరాహోరీగా సాగింది. పోటీల్లో బల్లికురువ మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన వేల్పూరి నాగవల్లి పొటేళ్ల సత్తాచాటి ప్రథమ స్థానం పొందాయి. పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామానికి చెందిన పొటేళ్ల ద్వితీయస్థానం పొందాయి.

- అన్నంబొట్లవారిపాలెంలో ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో సీనియర్ విభాగానికి సంబంధించి మంగళవారం రాత్రి జరిగిన జాక్‌పాట్ పోటీల్లో గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన గిత్తలు విజేతగా నిలిచాయి. ఆర్‌ఆర్ మెమోరియల్ పులగం త్రిషజ్ఞ రెడ్డి, పులగం జస్విత రెడ్డికి చెందిన ఎడ్ల జత ప్రథమ, కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామం మేకపాటి కృష్ణమోహన్ ఎడ్లు ద్వితీయ, నంద్యాల జిల్లా శిరిమెళ్లకి చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లు మూడో స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోటి శిరీషచౌదరి ఎడ్లు, పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన కటకం లక్ష్మణ్ కుమార్ గిత్తలు నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి..



పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



బాపట్ల: ఎడ్ల బలప్రదర్శన పోటీలను వీక్షిస్తున్న ప్రజానీకం

అమరావతి.. ఆనందం



- రాజధాని రైతులకు కౌలు బకాయిల చెల్లింపు
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలకు పాలాభిషేకం
- ఐదేళ్ల నిరీక్షణ అనంతరం గ్రామాల్లో పండుగ శోభ
- ఆరేడు నెలలుగా రాజధానిలో నిర్మాణ పనులు పరుగులు

తుళ్లూరు, గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల ఇంట.. ఈ సంక్రాంతి సంతోషాల పంటను తీసుకు వచ్చింది. ఒకవైపు ఆరేడు నెలలుగా రాజధానిలో పనులు పరుగులు తీస్తుండగా.. కొన్నేళ్లుగా నిలిచిపోయిన రాజధాని కౌలు బకాయిలను కూటమి ప్రభుత్వం భోగి రోజు విడుదల చేసింది. దీంతో రాజధాని గ్రామాల్లోని ప్రతీ ఇంటా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు నిత్య నరకం అనుభవించి, పండుగలూ, పర్వదినాలకు దూరమైన రైతులు ఈ ఏడాది సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. వైసీపీ పాలకులు, నాటి అధికారపార్టీల నేతల వేధింపులను ఎదుర్కొంటూనే గత ఐదేళ్ల రాజధాని వాసులు పోరుబాటపట్టారు. కిందటేడాది సంక్రాంతి సందర్భంగా మందడంలో టీడీపీ- జనసేన కూటమి 'భోగి సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అమరావతిపై వైసీపీ ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవోలను మంటల్లో కాల్చేశారు. అదే వేదికగా మరో 87 రోజుల్లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అమరావతి నుంచి ప్రజా పరిపాలన ప్రారంభమవుతుందని, బంగారంలాంటి రాజధానిని నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి రాజధాని నిర్మాణపనులను పరుగులు పెట్టించారు. ప్రమాణ స్వీకారానికి ముందే రాజధాని గ్రామాల్లోని 25వేల ఎకరాల్లో రూ.36.5కోట్లు ఖర్చు చేసి జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన ప్రభుత్వ భవనాల నిర్మాణం సహా పలు పనుల నిమిత్తం తాజాగా రూ.24 వేల కోట్ల పనులకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. మరో 11,467 కోట్లకు పనులకు ప్రభుత్వం బుధవారం పరిపాలనా ఆమోదం తెలిపింది. దీంతో అమరావతి నిర్మాణం పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే రాజధానిలో కీలకమైన సచివాలయ భవన సముదాయ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.4,890 కోట్లు కేటాయించింది. పునాదుల్లో చేరిన నీటిని భారీ మోటార్లతో తోడుతున్నారు. ఈ నెలాఖరులోపు ఆ పనులు కూడా ప్రారంభమవబోతున్నాయి.



తుళ్లూరులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు మహిళలు



వార్షిక కౌలు ఇవ్వటంతో స్వీట్లు పంచుకుంటున్న రైతులు

కౌలు చెల్లింపులతో పండుగే.. పండుగ

రాజధాని రైతులకు గత ప్రభుత్వం పెట్టిన కౌలు బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లించింది. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రెండేళ్లపాటు కౌలు నిలిపివేయడంతో ఆ బకాయిలే రూ.525 కోట్లకు పైగా ఉంది. అందులో తొమ్మిదో ఏడాది కౌలు బకాయిలను కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో చెల్లించింది. కాగా అసైన్డ్ రైతులకు సీఐడీ కేసుల కారణంగా బకాయిలు పెండింగులో పడిపోయాయి. ఈ ఆరునెలల్లో వారి కేసులను పరిష్కరించి, వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం కౌలు చెల్లించింది. సాధారణరైతులు 24 వేల మంది రైతులకు ఇచ్చే పదో ఏడాది కౌలుతో పాటు, 3,123 మంది అసైన్డ్ రైతులకు మూడేళ్ల కౌలు బకాయిలను చెల్లించింది. దీంతో తుళ్లూరు, రాయపూడిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు రాజధానివాసులు పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కౌలు బకాయిల విడుదలతో దళిత, ముస్లిం మైనార్టీ కుటుంబాలు నిజమైన పండుగ జరుపుకుంటున్నామని దళిత బహుజన జేఏసీ అధ్యక్షుడు చిలకా బసవయ్య తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌లకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

» పలుచోట్ల ముగ్గుల పోటీలు
» గ్రామాల్లో స్వామివార్ల తిరువీధి ఉత్సవం

వేటపాలెం(చీరాల), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సర్వదినాన్ని పురస్కరించుకుని రామన్నపేట శివాలయం వద్ద రామన్నపేట ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి హాజరైన మహిళలు ముగ్గుల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తాము వేసే ముగ్గులలో సంక్రాంతి పండుగతో పాటు సమాజ హితాన్ని కోరేలా వారు ముగ్గులు తీర్చిదిద్దారు. గెలుపొందిన వారికి సినీనటుడు, వేటపాలెం ముద్దుబిడ్డ అజయ్‌ఘోష్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళనుకళగా చూస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. పోటీలో గెలుపొందిన వారికి ఆయన చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చీరాలటౌన్ : భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలు చీరాల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఈక్రమంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ముగ్గులు, వివిధ సాంస్కృతిక పోటీలు సాగాయి. పండుగకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకుని యువతీయువకులు, పెద్దలు ఆనందించారు. నూతన వస్త్రాలను ధరించి పండుగను ఆనందించారు. బుధవారం పెద్ద సంఖ్యలో ఉద్యోగ, విద్యాభ్యాసాలు సాగించే ఊళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో బస్టాండ్, రైల్వే స్టేషన్ కిటకిటలాడింది.

హోరాహోరీగా గుండురాయి పోటీలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం పంచాయతీ సావరపాలెం పోలేరమ్మ గుడివద్ద


గుండురాయి పోటీల విజేతలు సాంబయ్య, హేమంత్


పోటీలలో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

50 కేజీల గుండురాయిని ఎత్తే పోటీలు ఘనంగా జరిగాయి. ఈ జిల్లాస్థాయి గుండురాయి పోటీలు శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో 21 సంవత్సరం లోపు వయసు వారికి జరిగాయి. యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు. జెల్లి సాంబయ్య, హేమంత్ రెండు సార్లు పోటీ పడి ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. దీంతో ఇద్దరు ప్రథమ బహుమతికి ఎంపికయ్యారు. గొర్ల గణేష్ మూడవస్థానానికి పరిమితమయ్యాడు. దీంతో నిర్వాహకులు విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

బల్లికురవ : మూడు రోజులుగా గ్రామాలలో సంక్రాంతి పండగ వేడుకలను ప్రజలు సందడితో జరుపుకున్నారు. పట్టణ ప్రాంతాలలో ఉండే బంధుమిత్రులతో కలిసి గ్రామాలకు చేరి పండుగను జరుపుకొన్నారు. మంగళవారం అన్ని గ్రామాలలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అలానే పలు చోట్ల మహిళలు, యువకులు పలు రకాల పోటీలలో పాల్గొన్నారు. బుధవారం చిన అంబడిపూడి, కొత్తపాలెం తదితర గ్రామాలలో మోటార్ సైకిల్ స్లో, మరియు ముగ్గుల పోటీలతో పాటు ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించారు. మండలంలోని కొణిదెన గ్రామంలో యువకులు పాట కచేరీ ఏర్పాటు చేసి ప్రజలను ఉత్సాహ పరిచారు.

పంగులూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలలో ముగ్గులు, క్రీడల పోటీలు నిర్వహించారు. మంగళ, బుధ వారాలలో రేణంగివరం, పంగులూరు, నూజెళ్లపల్లి తదితర గ్రామాలలో జరిగిన ముగ్గులు, క్రీడల పోటీలలో మహిళలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. వివిధ ప్రాంతాలలో కొలువులుదీరిన యువత గ్రామాలకు చేరుకుని ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. రేణంగివరంలో టీడీపీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, బాలికలకు కుర్చీలాట, యువతకు కబడ్డీ, ట్రాక్టర్ రేసింగ్ పోటీలు నిర్వహించారు. టీడీపీ నేత బోరెడ్డి ఓబుల్‌రెడ్డి వారి మిత్ర బృందం విజేతలకు బహుమతులు అందచేశారు. గ్రామాల్లో స్వామి గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సినీనటుడు అజయ్‌ఘోష్

మేదరమెట్ల : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలల్లో ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం రావినూతలలో గంగమ్మ గుడి వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న మహిళలు అందరికి బహుమతులు అందజేశారు. మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చినగంజాం : గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను వేడుకగా నిర్వహించారు. మకర సంక్రాంతి, కనుమ పండగలను మంగళ, బుధ, వారాల్లో గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో కోలహలం నెలకొంది. మున్నంవారిపాలెంలో లక్ష్మణ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి ప్రత్యేకంగా అలంకరించిన టైరుబండిపై ఉంచి మున్నంవారిపాలెం, చినగంజాం, మూలగానివారిపాలెం గ్రామ ప్రధాన వీధులలో మంగళవాయిద్యాలు, బాణసంచాలతో ఊరేగింపు నిర్వహించి, తదనంతరం బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని చెరువులో తెప్పోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కడవకుదురు గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కడవకుదురు గ్రామ టీడీపీ, శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో చెడుగుడు, రంగవల్లుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. సంతరావూరు గ్రామంలో లక్ష్మీచెన్నకేశవస్వామికి గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం కొమ్మమూరు కాలువలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మార్టూరు : నేతాజీనగర్‌లో గుంటూరు రామారావు షాపు సమీపంలో మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా యువతీయువకులకు పలు పోటీలు నిర్వహించారు. ముగ్గులపోటీలలో పత్తిపాటి దుర్గమ్మ, నాగండ్ల విజయలక్ష్మి, నాగండ్ల నాగ ప్రవళిక బహుమతులు గెలుచుకున్నారు. కబడ్డీలో మొదటి బహుమతిని బైండ్లయూత్ నేతాజీనగర్, రెండవ బహుమతిని రామ్‌నగర్ కాలనీయూత్ గెలుచుకుంది. కుండ కొట్టే పోటీలలో మొదటి బహుమతిని గుంటూరు గోపిచంద్, రెండవ బహుమతిని గుంటూరు అమర్నాథ్ గెలుచుకున్నారు.


నాగరాజుపల్లిలో లక్ష్మీనారాయణస్వామి తిరువీధోత్సవం

కనులపండువగా రాములోరి తెప్పోత్సవం

మార్టూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం మండలంలోని రాజుపాలెం, నాగరాజుపల్లి గ్రామాలలో రామోలోరి తెప్పోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. రాజుపాలెం గ్రామంలో కోదండ రామస్వామి దేవస్థానం నుంచి సీతా కోదండరామస్వామి లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన బోటులో చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు.అనంతరం అర్చకులు సీతారామాచార్యులు పర్యవేక్షణలో గ్రామోత్సవం చేశారు. అదేవిధంగా నాగరాజుపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీనారాయణస్వామి దంపతుల ఉత్సవ విగ్రహాలను చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. తరువాత అర్చకులు వెంకట సుబ్బాచార్యులు, శివసాయి కృష్ణ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రజలు తిలకించారు.

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మార్టూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో జిల్లా స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలలో ఇంకొల్లుకు చెందిన ప్రఫుల్ అండ్ ఆంజనేయులు టీమ్ మొదటి స్థానాన్ని, రెండవ స్థానాన్ని వలపర్లకు చెందిన జాన్ అండ్ కిషోర్ టీమ్, మూడవ స్థానాన్ని పంగులూరుకు చెందిన కాలేషా అండ్ మణి టీమ్ గెలుచుకున్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

సంతమాగులూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక సోదాలు నిర్వహించి కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని, రెండు కోళ్లను ఎస్ఐ పట్టాభి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లను, రూ.3600 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీ

నలుగురికి గాయాలు

మేదరమెట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలోని రావినూతల రోడ్డులో రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి బుధవారం ఉదయం తెనాలికి చెందిన ఎద్దు రవీంద్ర తన అమ్మమ్మ ఊరు అయిన రావినూతల వచ్చాడు. తాత అంకయ్యను ఎక్కించుకుని మేదరమెట్ల వెళుతుండగా ఒడిసాకు చెందిన ఇద్దరు వ్యక్తులు రావినూతల వైపు వెళ్తు రవీంద్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ సంఘటనలో 4లుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ సంఘటన్‌పై స్థానికులను విచ్చారిస్తున్నారు.

విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ

మార్టూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో 10వతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీదేవి అక్షర సమితి ఛైర్మన్ ఈవీ నారాయణ ఉపకారవేతనాలను అందచేశారు. మంగళవారం కోలలపూడి జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఉపకారవేతనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, కందిమళ్ల సాంబశివరావు, అంజిబాబు, రామకోటేశ్వరరావు, నాగేశ్వరరావు, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న పెద్దలు

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెం పద్మనాభునిపేటలో బుధవారం రాత్రి భద్రాతి సమేత భావనరుషి స్వామి తిరుణాళ్ళ, చీరాల పాపరాజుతోటలోని శ్రీ కృష్ణ గోశాలలో జరిగిన ప్రత్యేక పూజల్లో, తెల్ల గాంధీ బొమ్మ సమీపంలో భద్రావతీ సమేత భావనారుషి స్వామి తిరుణాల్లలో కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే కొండయ్యను అర్చకులు స్వాగతం పలికి, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గ్రామస్థులు, భక్తులు పలు అంశాలను కొండయ్య దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొలుపు ఉత్సవం


మేళతాళాలతో ఊరేగుతున్న మహాలక్ష్మి అమ్మవారు

పంగులూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవం భక్తిశ్రద్ధలతో సాగుతోంది. వేద పండితుల పూజా కార్యక్రమాలు, విద్యుత్ దీపాలతో రూపుదిదుకున్న ప్రభ ఊరేగింపు, రాత్రి వేళ కోలాట ప్రదర్శనలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సంగీత కచేరీ కార్యక్రమాలతో సందడి నెలకుంది. సంక్రాంతి పండుగతో పాటు తమ ఇంటి ఇలవేల్పుగా భావించే అమ్మవారి కొలుపు ఉత్సవం సందర్భగా ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ పనుల నిమిత్తం పొరుగు ప్రాంతాలలో స్థిరపడిన గ్రామస్థులు, బంధు మిత్రులు గ్రామానికి చేరుకోవడంతో వీధులలో జన సందోహంతో సందడి నెలకుంది. గ్రామంలోని ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకించారు. బుధవారం సూర్య బలిజ వంశస్తులు అమ్మవారికి మోయనం సమర్పించి, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారికి అభిముఖంగా వెనుకకు నడుస్తూ పూలు, తమలపాకులు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు.

చికెన్, మటన్ దుకాణాల వద్ద బారులు


భవానీ సెంటర్‌లో చికెన్ దుకాణాల వద్ద బారులు తీరిన ప్రజలు

అద్దంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ రోజు కనుమను మాంసం ప్రియులు ఆ నందంగా చేసుకున్నారు. గతంలో వలే పశువులను పూజించటం పూర్తిగా కనుమరుగై కనుమ అంటే మాంసం తినడంగా మారింది. ఈ క్రమంలో బుధవారం అద్దంకి పట్టణంలో చికెన్, మటన్, ఫిష్ దుకాణాల వద్ద కొనుగోలుదారులు బారులు తీరారు. వందల సంఖ్యలో కొనుగోలుదారులు చేరడంతో నామ్ రోడ్డుపై ట్రాఫిక్‌కు కూడా అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా పోతురాజుగండి వద్ద నుంచి భవానీసెంటర్, శింగరకొండ రోడ్డులో మసీదు సమీపం వరకు బుధవారం ఉదయం మాంసం ప్రియులతో కిటకిటలాడింది. మటన్ దుకాణాలు కూడా గతం కంటే మూడింతలు ఎక్కువగా ఏర్పాటు చేశారు. సంక్రాంతికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చి సరదా కుటుంబసభ్యులతో గడిపే క్రమంలో బుధవారం పట్టణంలో ఉన్న నాలుగు సినిమా హాళ్లు కూడా కిక్కిరిసిపోయాయి.

ఎన్టీఆర్ నా జీవితంలో అంతర్భాగం

» మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహ్మద్ షరీఫ్
» అనంతవరంలో ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు ప్రారంభం


షరీఫ్‌ను సత్కరిస్తున్న సభలో అమరావతి జేఏసీ కన్వీనర్ సుధాకర్, అమరావతి మహిళా రైతులు

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ నా జీవితంలో అంతర్భాగమని ఆ మహానుభావునితో రాజకీయంగా కలిసి పనిచేయడం నా అదృష్టం.. పైసా ఖర్చు చేయకుండా టీడీపీ నాకు పెద్ద పదవులు ఇచ్చిందని అదీ ఆ పార్టీ గొప్పతనమని రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారులు జనాబ్ మహమ్మద్ షరీఫ్ గుర్తుకు తెచ్చుకున్నారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో బుధవారం రాత్రి ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ ఉభయ తెలుగురాష్ట్రాల నాటిక పోటీలను జనాబ్ మహమ్మద్ షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు అధ్యక్షత వహించారు. అతిథులుగా జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్, మారెళ్ల వంశీ పాల్గొన్నారు. ఈ సభలో షరీఫ్‌ను కళాపరిషత్ సభ్యులు ఆధ్వర్యంలో మారెళ్లవంశీ శాలువా కప్పి సత్కరించారు. అమరావతి మహిళా రైతులు, పువ్వాడ సుధాకర్, కందిమళ్ల సాంబశివరావుతో పాటు పలువురు గ్రామస్థులు షరీఫ్‌ను సత్కరించారు. తరువాత షరీఫ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతి గౌరవాన్ని,ఔన్నత్యాన్ని,ప్రతిష్టను చాటి చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

ఎన్టీఆర్ కళాపరిషత్ నాటికపోటీలలో తొలుత విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే స్వేచ్ఛ నాటికను ప్రదర్శించారు. వ్యక్తుల జీవితాలలో వారి జీవనవిధానాలలో స్వేచ్ఛ అనేది నిర్ణయాత్మక నియంత్రణ, సంరక్షణతో కూడుకున్న స్వచ్ఛతగా ఉండాలని, మితిమీరిన స్వేచ్ఛ తెగిన గాలిపటం లాంటిదనే సందేశంతో ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక ప్రేక్షకులను ఆకట్టుకున్నది. తరువాత న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారు ప్రదర్శించిన ఐ ఏట్ ఇండియా నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడుదశాబ్దాలు అయినా పేదవారు పేదగానే ఉన్నారని, రాజకీయనాయకులు మాత్రమే ధనవంతులుగా ఎదిగారనే, కడుపుమండిన పేదవారు ఆలోచనాధోరణిని ఇతివృత్తంగా నాటికను ప్రదర్శించారు. చివరగా శ్రీసద్గురు కళాసమితి గుంటూరు వారు కమనీయం నాటికను ప్రదర్శించారు. కళాకారుడు తన వారసత్వాన్ని మరో కళాకారునికి అందిస్తున్నట్లే, కళా హృదయులు కూడా తమ కళాభిమానాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో నాటిక ప్రదర్శన సాగింది. కళారూపాలు ప్రదర్శించే చోటికే ప్రేక్షకులు రావాలనే సందేశంతో నాటిక ముగుస్తుంది. గురువారం నాటిక ప్రదర్శ కొనసాగనుంది.


స్వేచ్ఛ నాటికలోని సన్నివేశం


కమనీయం నాటికలోని సన్నివేశం

టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


ప్రథమ బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

అద్దంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయపాలెంలో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొత్తం 25 మంది మహిళలు పాల్గొన్నారు. బంపర్ ప్రైజ్‌ను డ్రా ద్వారా తీసి సోఫాసెట్‌ను అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.5వేలు, రూ.3 వేలు, రూ.2వేలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పరిటాల శ్రీనివాసరావు, నాగరాజు, శ్రీరామమూర్తి, కాశయ్య, మోహనరావు, రాఘవరావు పాల్గొన్నారు.

చరిత్ర అధ్యయనం.. భవిష్యత్ తరాలకు అవసరం

ఇంకొల్లు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : చరిత్ర అధ్యయనం భవిష్యత్తు తరాలకు అవసరమని నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు పేర్కొన్నారు. ఇంకొల్లుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మేడూరి సత్యనారాయణ రచించిన ఇంకొల్లు చరిత్ర గ్రంథాన్ని ఇంకొల్లులో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆ గ్రంథాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా రావి నాగేశ్వరి అధ్యక్షతన జరిగిన సభలో రావెల సాంబశివరావు మాట్లాడుతూ వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన ఇంకొల్లు చరిత్రను గ్రంథ రూపంలో ప్రజలకు అందించిన రచయిత సత్యనారాయణ కృషి అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కొల్లూరి నాయుడమ్మ, చుండి మురళి, లక్ష్మణబాబు, హరిబాబు, అబ్రహంలింకన్, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





బుచ్చి : పారువేట ఉత్సవంలో పెనుబల్లికి తరలివెళుతున్న మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి



జాఫర్‌సాహెబ్ కాలువ ఘాట్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం

ఉత్సాహంగా

సంక్రాంతి సంబరాలు

- ఆకట్టుకున్న కనుమ వేడుకలు
- ఇంటింటా బంధుమిత్రుల కోలాహలం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- గ్రామదేవతలకు వైభవంగా గ్రామోత్సవం
- పలుచోట్ల రంగవల్లులు, పతంగుల పోటీ
- వివిధ ప్రాంతాల్లో కోడి పందేలు, ఎడ్ల పోటీల నిర్వహణ

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రజలంతా మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ పండుగలను ఉత్సాహంగా జరుపుకున్నారు. కొత్త అల్లుళ్ల సందడి, బంధుమిత్రుల కోలాహలం, రంగవల్లులు, పతంగుల పోటీలు, కోడిపం దేలు, ఎడ్ల పోటీల వంటి వాటిని వేడుకగా నిర్వహించారు. వివిధ ఆలయాలకు తరలి వచ్చిన భక్తులతో ఆలయాలన్నీ కళకళలాడాయి. ఇంటింటా పొంగళ్లు పొంగించి పెద్దల కు పూజలు చేశారు. తమ పూర్వీకులు ఆత్మశాంతి కోసం సమాధులను అలంకరించి, వారికి ఇష్ట వంటకాలను నైవేద్యంగా పెట్టి స్మరించుకున్నారు. పెద్దల పండుగ కోసం ప్రభుత్వం తరఫున మౌలిక సదుపాయాలు కల్పించారు.



రాజరాజేశ్వరి అమ్మవారికి పారువేట అలంకారం

● కనుల పండువగా కనుమ

జిల్లా వ్యాప్తంగా బుధవారం కనుమ పండుగ కనుల పండువగా జరిగింది. రైతులు తమ ఇళ్లలో, అర్చకులు, ప్రముఖులు ఆలయాల్లో గోపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులను స్నానాలు చేయించి, రంగులు, పూల దండలతో అలంకరించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని రైతలు తమ ఇష్టదైవాలను పూజించారు. అలాగే దేవదాయ పరిధిలోని అన్నీ ఆలయాల్లో వైభవంగా కనుమ గోపూజలు జరిగాయి.

● నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి, మూలాపేట వేణుగోపాలస్వామి, అయ్యప్పగుడి, మూలాపేట మూలస్థానే శ్వరాలయాల్లో గోపూజలు జరిగాయి. గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో తొలిసారిగా కనుమ పండుగను నిర్వహించారు. ఆలయ ఈవో వీ గిరికృష్ణ ఆధ్వర్యంలో సంస్కృతి సంప్రదాయం ప్రకారం కనుమ పండుగను నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

● ఘనంగా పారువేట

కనుమ సందర్భంగా స్వామివార్లకు ఘనంగా పారువేట నిర్వహించారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, నవాబు పేట, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో చిన్నా పెద్దా ఆలయాల నుంచి స్వామి, అమ్మవార్లు తరలివచ్చి భక్తులకు ఆశీస్సులు అందించారు.

● వైభవంగా తెప్పోత్సవం

నగరంలోని జాఫర్‌సాహెబ్ కాలువ మైపాడుగేట్ ఘాట్‌లో బుధవారం రాత్రి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి కనుమ తెప్పోత్సవం వైభవంగా జరిగింది. తొలుత స్వామివారు మైపాడు గేటు వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో వేంచేసి భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం స్వామివారిని కిసాన్‌నగర్ వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పురపాలకశాఖ మంత్రి పొంగూరి నారాయణ పాల్గొని తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ విద్యుద్దీపాలంకరణ, బాణసంచా వేడుకలు కనువిందు చేశాయి.



కావలి : గ్రామోత్సవంలో శ్రీకలుగోళశాంభవి

కోలాహలంగా తెప్పల పోటీ

నగరంలోని లేక్‌వ్యూకాలనీ స్వర్ణాల చెరువులో బుధవారం కనుమ సందర్భంగా తెప్పల పోటీ జరిగింది. 35వ డివిజన్ టీడీపీ నాయకుడు బర్నబాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీ లను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు ప్రజలు భారీగా తరలివచ్చి పోటీలను ఆసక్తిగా తిలకించారు.



స్వర్ణాల చెరువులో నిర్వహించిన తెప్పల పోటీ

హోరాహోరీగా కోళ్ల పందేలు
చేతులు మారిన రూ. కోట్లు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గంలో విచ్చలవిడిగా కోడిపందేలు నడిచాయి. నిర్వాహకులు ఎంట్రీ టికెట్లు పెట్టి మూడురోజులపాటు బహిరంగంగా పందేలు నిర్వహించారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పందెంరాయుళ్లు హాజరుకాగా, పోలీసులు చేష్టలుడిగి చూస్తుండిపోయారు. ఉలవపాడు మండలం రామాయపట్నం సమీపంలో అధికార పార్టీకి చెందిన మండల నేత ఈ కోడిపందేలకు ఏర్పాట్లు చేశారు. కందుకూరు మండలం పలుకూరు సమీపంలో ఆ గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. కోళ్లతో హాజరయ్యే వారు రూ.1000, వీక్షించేందుకు వచ్చేవారు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లిస్తేనే బరిలోకి నిర్వాహకులు అనుమతించారు. అలాగే అక్కడికి వచ్చే కార్లు, మోటా రుసైకిళ్లు, ఇతర వాహనాలకు పార్కింగ్ ఫీజు కూడా వసూలు చేశారు. రూ. 10వేలు, రూ. 20వేలు, రూ. 30వేలు విభాగాలుగా విభజించి బెట్టింగ్‌లు జరిపారు. ఈ మూడు రోజులలో పదినుంచి పదిహేను కోట్ల రూపాయ లు చేతులు మారాయని అంచనా వేస్తున్నారు.



పలుకూరు వద్ద ఏర్పాటుచేసిన బరిలో తలపడుతున్న కోళ్లు



ఉలవపాడు : ఆలయ కోనేరులో శ్రీదేవిభూదేవి సమేత శ్రీవేణుగోపాలస్వామి తెప్పోత్సవం



బ్రాహ్మణక్రాకలో ఎడ్ల బండలాగుడు పోటీలు



బిట్రగుంటలో కబడ్డీ పోటీలు..

తిరుగు ప్రయాణం..
మరింత భారం

- టికెట్ ధర రెండింతలు చేసిన ప్రైవేటు ట్రావెల్స్
- ఆన్‌లైన్‌లోనూ యథేచ్ఛగా పెంపు
- ప్రయాణికుల నిలువు దోపిడీ



మినీ బైపాస్‌లో ప్రయాణికుల కోసం వేచి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా సొంతూర్లకు వచ్చి తిరిగి వెళ్లేవారికి ప్రయాణం ఖరీదుగా మారింది. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా, వేలాదిమందికి ఆ బస్సులు సరిపోలేదు. దీంతో ప్రజలు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించక తప్పలేదు. ఈ అవకాశం కోసం ఎదురుచూస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు రెండింతలకు పైగా టికెట్ ధర పెంచారు. అంతేకాక వాటిని ఆన్‌లైన్‌లో ఉంచి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాదు, బెంగళూరు, కర్నూలు, వైజాగ్, చెన్నైకి తదితర ప్రాంతాలకు పండుగ తర్వాత నడిచే ప్రైవేటు ట్రావెల్స్‌కు నిర్వాహకులు ఇష్టానుసారంగా టికెట్ రేటు పెంచారు. తప్పనిసరిగా వెళ్లాల్సిరావడంతో ప్రజలు అధిక ధరలు చెల్లించి ప్రయాణిస్తున్నారు.

● ఆన్‌లైన్‌లోనూ ధరల పెంపు

ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు పండుగ రోజుల్లో ప్రయాణికులను దోచుకునే తీరును నేరుగా ఆన్‌లైన్‌లో ఉంచారు. ఆన్‌లైన్‌లో యాప్‌లో భారీగా పెంచిన టికెట్ల ధరలను ఉంచి సీట్లు బుక్ చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి టికెట్ రేటు పెంచు కుంటూ పోతు న్నారు. అయితే అటు ప్రభు త్వం, ఇటు రవాణాశాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయి. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు.

టికెట్ల ధరలో వ్యత్యాసం

ప్రాంతం	పాత ధర	పెంచిన ధర
హైదరాబాద్ (నాన్ ఏసీ)	రూ.800	రూ.1500-2000
హైదరాబాద్(ఏసీ)	రూ.1300	రూ.2000-2500
బెంగళూరు(నాన్ ఏసీ)	రూ.800	రూ.1500-2000
బెంగళూరు(ఏసీ	రూ.1300	రూ.2000-2800

● ఆర్టీసీలో సాధారణ చార్జీలే..

ఆర్టీసీ నెల్లూరు రీజియన్ నుంచి సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్, బెంగుళూరు, కర్నూలు, వైజాగ్, చెన్నై ప్రాంతాలకు రానుపోను ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నారు. అంతేకాక ఈ సర్వీసుల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ప్రయాణికులు నేరుగా ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకోవచ్చు.

'సర్వేపల్లి'కి మహర్దశ

- రిజర్వాయర్ అభివృద్ధికి ప్రతిపాదనలు
- రూ.50.41 కోట్లతో ఇరిగేషన్‌శాఖ ప్రపోజల్స్
- సోమిరెడ్డి చొరవతో రూ.15 కోట్ల పెంపు
- బండ్‌ను బలపరచి, ఆపై రోడ్డు నిర్మాణం
- తాగు,సాగునీరు, పరిశ్రమలకు ప్రధాన వనరు
- టూరిజం స్పాట్‌గా డెవలప్‌మెంట్‌కు అవకాశం

నెల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తాగు, సాగు నీటి అవసరాలకు, పరిశ్రమలకు ప్రధాన వనరుగా ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్‌కు మహర్దశ పట్టనుంది. బ్రిటీషు కాలంలో నిర్మించిన ఈ రిజర్వాయర్‌ను భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. సర్వేపల్లి రిజర్వాయర్‌ను పూర్తిగా అభివృద్ధి చేసేందుకు రూ.50.41 కోట్లతో ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయి. ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టు అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో త్వరలోనే అనుమతులు మంజూరయ్యే అవకాశాలున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

● 1.73 టీఎంసీల సామర్థ్యం

డెల్టా ప్రాంతంలోని ప్రధాన నీటివన రుల్లో సర్వేపల్లి రిజర్వాయర్ ఒకటి. ఈ రిజర్వాయర్ కింద 15,735 ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారింగా మరో ఐదువేల ఎకరాల వరకూ సాగవుతుందని అంచనా. 1.73 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ ఆయకట్టుకు సాగు నీరు అందించడమే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలను కూడా పెంచుతోంది. ఇకపోతే ఇప్పటికే కొన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నది. భవిష్యత్‌లో ఈ గ్రామాల సంఖ్య 23కు పెరిగే అవకాశాలు న్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంతటి ప్రాముఖ్యత గల ఈ రిజర్వాయర్ అభివృద్ధికి నోచుకోవడంలేదు. పలుచోట్ల రిజర్వాయర్ కట్ట దెబ్బతింది. కొన్ని చోట్ల రివిట్‌మెంట్ లేకపో వడంతో ఏటా పిచ్చి మొక్కలు పెరగడం, తద్వారా నీటి నిర్వహణ కష్టంగా మారుతోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు కట్టకోతకు గురవుతుండడంతో ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వంలో సుమారు రూ.10 కోట్లతో కట్ట అభివృద్ధి పనులు చేపట్టినా, నాడు బిల్లులు సమస్యతో పనులు జరగలేదు.

● సోమిరెడ్డి చొరవతో అంచనాల పెంపు

సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ అధికారులు రూ.50.41 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తొలుత నాబార్డు ఫండ్ కింద జిల్లాకు రూ.100 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఆ పరిధిలోనే డెల్టాలోని ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది. దీంతో సర్వేపల్లి రిజర్వాయర్‌కు రూ.35.41 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవ తీసుకొని రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడారు. రిజర్వాయర్ అభివృద్ధి ఆవశ్యతను వారికి వివరించారు. దీంతో ఉన్నతాధికారులు మరో రూ.15 కోట్లు అదనంగా సర్వేపల్లి రిజర్వాయర్‌కు కేటాయించగా, ఆ మేరకు జిల్లా నుంచి రివైజ్డ్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి.

రిజర్వాయర్ బయట భాగంలో డ్రైప్యాకింగ్ ఆప్రాన్ నిర్మించేలా, లోపల భాగంలో కాంక్రీట్ గ్రౌటింగ్ విత్ ఆప్రాన్ పనులు చేసేలా ప్రతిపాదించారు. రిజర్వాయర్ బండ్ దూరం 6.8 కిలోమీటర్లు ఉండగా, దానిపై బీటీ రోడ్డు నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తద్వారా గొలగమూడి నుంచి ఈదగాలి వరకు గ్రామాల మధ్య రాకపోకలకు సులభమైన మార్గం ఏర్పడుతుంది. ఈ బండ్‌పై లైటింగ్ ఏర్పాటు చేసి బోటింగ్‌కు అవకాశం కల్పిస్తే సర్వేపల్లి రిజర్వాయర్‌ను టూరింగ్ స్పాట్‌గా కూడా అభివృద్ధి చేయవచ్చునని భావిస్తున్నారు. అలానే రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునేందుకు పరిశ్రమలన్నీ ఒకతాటిపైకి వచ్చి పైపు లైన్ ఏర్పాటు చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇది పూర్తయ్యాక పరిశ్రమలకు ఇచ్చే నీటి ద్వారా రాయల్టీని వసూలు చేస్తారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరనున్నది.



కోతకు గురైన సర్వేపల్లి రిజర్వాయర్ కట్టకు వేసిన ఇసుక బస్తాలు

ప్రతిపాదనలు పంపాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేశాం. రూ.50.41 కోట్లతో సిద్ధం చేసిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

- ఎం అనీల్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ నెల్లూరు డీఈ

● పరిశ్రమలకు ఎంతో అవసరం

సర్వేపల్లి రిజర్వాయర్ అవసరం ఇప్పుడు పరిశ్రమలకు కూడా ఎక్కువవుతోంది. ఇప్పటికే కృష్ణపట్నం పోర్టుతోపాటు మరో 16 భారీ పరిశ్రమలకు ఈ రిజర్వాయర్ నుంచి నీటిని అందించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వ సంస్థ క్రిబ్‌కో చేపడుతున్న భారీ పరిశ్రమకు కూడా ఇక్కడి నుంచే నీటిని సరఫరా చేసేందుకు ఉత్తర్వులిచ్చింది. ఇలా కృష్ణపట్నం ప్రాంతంలో ఏర్పాటవుతున్న పరిశ్రమల నీటి అవసరాలు కూడా సర్వేపల్లి రిజర్వాయర్‌పైనే ఆధారపడి ఉన్నాయి. అదే సమయంలో దేశంలోనే అతిపెద్ద ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల్లో ఒకటైన క్రిస్‌సిటీకు ఇటీవలే ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. కృష్ణపట్నం పోర్టు ఆధారితంగా కోట, చిల్లకూరు మండలాల్లో ఏర్పావుతున్న క్రిస్ సిటీకు కూడా నీటి అవసరాలను తీర్చే అవకాశం సర్వేపల్లి రిజర్వా యర్ ద్వారా ఉందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధిపై దృష్టి పెట్టింది.



పెద్దల పండుగ సందర్భంగా బోడిగాడితోటలోని సమాధుల వద్ద మంత్రులు ఆనం రామనారాయణ, పొంగూరు నారాయణ తదితరులు

పురాతన ఆలయాల
పునర్నిర్మాణం

- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పురాతన ఆలయాలను పునర్నిర్మిస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మంగళ వారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలిసి నగరంలోని నవాబుపేట ధర్మరాజులస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం బోడిగాడితోటలోని సమాధుల వద్దకు చేరుకుని, పెద్దల పండుగ కోసం అక్కడికి వచ్చిన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నవాబుపేట శివాలయానికి చేరుకుని, పునఃనిర్మాణం గురించి చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో శివాలయం పునఃనిర్మాణానికి ఎన్నో ప్రయత్నాలు జరిగినా, టెండర్ల ప్రక్రియ కూడా దాటలేదన్నారు. తమ హయాంలో శివాలయాన్ని పునఃనిర్మించడంతో పాటు నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయానికి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయ భూమిని 24 కుటుంబాలవారు ఆక్రమించి కాపురాలు ఉంటున్నారని తెలిపారు. వారికి వేరేచోట ఇళ్లు నిర్మించి ఇచ్చి ఆలయభూమి స్వాధీనం చేసుకుంటామన్నారు. పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేస్తున్న ఆనంకు నారాయణ అభినందనలు తెలిపారు.

● బోడిగాడితోట పేరు మార్పు

బోడిగాడితోట శ్మశానవాటికలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రులు ఆనం, నారాయణ, తెలిపారు. బోడిగాడితోట పేరు కూడా మార్పు చేస్తామన్నారు. శ్మశానంలో మహాశివుడు సంచరి స్తారిస్తారు కాబట్టి, ఆ శ్మశానవాటికలో శివతాండవం చేస్తున్న మహాశి వుడి విగ్రహం ఏర్పాటుతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపడుతామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఓ.వీ. నందన్, దేవదాయ శాఖ ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈవో కవిత, టీడీపీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా

పార్వేట ఉత్సవం



కందుకూరు: పార్వేట ఉత్సవం సందర్భంగా కొలువుదీరిన దేవతామూర్తులు

కందుకూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కనుమ పర్వదినం సందర్భంగా కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయం ప్రాంగణంలో బుధవారం రాత్రి పార్వేట మహోత్సవం ఘనంగా జరిగింది. పట్టణంలోని వివిధ ఆలయాల ఉత్సవమూర్తులు గ్రామోత్సవంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంకు చేరుకుని కొలువుదీరగా భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల ఏర్పాటుచేయగా అమ్మవారి ఆలయ పూజారులు భక్తులకు అందజేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పార్వేట మహోత్సవానికి హాజరై అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మాధవి కుటుంబసమేతంగా అంకమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

కనుల పండువగా వేణుగోపాలుడి తెప్పోత్సవం

●ఉలవపాడు (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేణుగోపాలస్వామి తెప్పోత్సవం స్వామివారి కోనేరులో కనులపండువగా జరిగింది. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి ఉదయం కల్యాణం నిర్వహించారు. ఎస్సై అంకమ్మ పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దపట్టపుపాలెంలో మూడు జిల్లాల స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి అలగాయపాలెం జట్టుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తనయులు అవినాష్, సందీప్‌లు ప్రకటించిన బహుమతి ఎమ్మెల్యే తరఫున రూ.25000 కాపులకు అందించారు.

కలుగోళశాంభవి గ్రామోత్సవం

●కావలిటౌన్ (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ దేవత కలుగోళశాంభవి తిరునాళ్ల, గ్రామోత్సవం వైభవంగా జరిగాయి. పట్టణంలో మంగళవారం కలుగోళశాంభవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్నేహ యూత్, ఫ్రెండ్లీ యూత్‌లు మూడు రోజులపాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఉర్రూతలూగించాయి. కళాకారులు అగ్నితో ఎన్టీఆర్ అక్షరాలు ప్రదర్శించడంతో తిలకించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి భావోద్వేగంతో లేచి రెండు చేతులు పైకెత్తి తన ఆనందాన్ని వ్యక్తపరచడంతో ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద ప్రారంభమైన గ్రామోత్సవం పట్టణ పురవీధుల్లో ఊరేగుతూ బుధవారం రాత్రి తిరిగి ఆలయానికి చేరుకుంది.

మహాలక్ష్మమ్మ మానుకు ప్రత్యేక పూజలు

●సంగం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో వెలసి ఉన్న మహలక్ష్మమ్మ వేప మానుకు సంక్రాంతి పండుగని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా కలువాయమ్మ, చెన్నకేశవస్వామి గ్రామోత్సవాలు

●కలువాయి (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం గ్రామదేవత కలువాయమ్మ, చెన్నకేశవస్వామి గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి, చెన్నకేశవస్వామి వారికి టెంకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చెన్నకేశవ స్వామికి పట్టువస్త్రాల సమర్పణ

●వింజమూరు (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామికి, గోదాదేవికి, విఘ్నేశ్వరస్వామికి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వింజమూరు గ్రామంలోని నడిమూరుకు చెందిన యల్లాల చిన్నవెంకటరెడ్డి, పుల్లమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు యల్లాల శ్రీనివాసులరెడ్డి, పద్మావతమ్మ, యల్లాల రఘురామిరెడ్డి, రజని, ప్రొఫెసర్ వై వి రామిరెడ్డి, మంజుల పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు గణపం రమణారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, మనోజ్, అనీల్, పునీత్, రిత్విక, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీనియర్ నేత వెంకటయ్య మృతి టీడీపీకి తీరని లోటు

● మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి



వెంగళశెట్టి వెంకటయ్య అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, తదితరులు

సీతారామపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కురువృద్ధుడు, ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత, మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంగళశెట్టి వెంకటయ్య మంగళవారం మృతిచెందారు. ఆయన స్వగ్రామం సీతారామపురం గ్రామపంచాయతీలోని సంగసానిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన అంత్యక్రియలకు ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కం భం విజయరామిరెడ్డి హాజరై వెంకటయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని అన్నారు. అంతిమ క్రతువులో కంభం విజయరామిరెడ్డితో పాటు టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొని వెంగళశెట్టి వెంకటయ్య భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఆయన పార్థివ దేహానికి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి అంజలి ఘటించారు. అంత్యక్రియలకు టీడీపీ నాయకులు హాజరై ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వెంగళశెట్టి వెంకటయ్య వ్యవసాయ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చి సీతారామపురం మండలంలో టీడీపీని బలోపేతం చేసి మండల టీడీపీ పెద్దాయనగా పేరుపొందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఆయన మృతిచెందారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ జనసేన నాయకులు భోగినేని కాశీరావు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల సీనియర్ నాయకులు చెన్నకేశవులు, జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, భోగినేని కాశీరత్తయ్య, ఎడమ ప్రవీణ్, ఇజ్రాయిల్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాపులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే ఇంటూరి



చిన్నారికి బహుమతి అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాపులకు అండగా ఉంటా నని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక బలిజపాలెం గ్రామంలో కోదండరామస్వామి దేవస్థానం వద్ద అడపా వెంకయ్య, పుల్లమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు మంగళవారం రాత్రి బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద ఆలయ చైర్మన్ మాటూరి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే మూతపడిన పాఠశాలను తిరిగి తెరిపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి మాల్యాద్రి, ఏ వెంకట్రావు, యు నాగేశ్వరరావు, ఏ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

18న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

కందుకూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 18న కందుకూరులో రక్తదానశిబిరం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిఏటా ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమంతో పాటు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరవతో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వెంగమాంబ ఫంక్షన్‌హాలులో జరిగే కార్యక్రమంలో యువత పాల్గొని రక్తదానం చేయాలని విజ్ఞప్తిచేశారు.

ఘనంగా మాజీ సీఎం మాయావతి జన్మదిన వేడుకలు

సంగం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బహుజన సమాజ్ పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టి కృష్ణ ఆధ్వర్యంలో మాయావతి ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జలదంకి : ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యేలు కాకర్ల, కావ్య తదితరులు



కొండాపురం : భీమవరప్పాడులో ముగ్గులు వేస్తున్న మహిళలు



అనంతసాగరం: పడమటి కంభంపాడులో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు

వాడవాడలా అంబరాన్నంటిన పండుగ సంబరాలు

● యువతకు ఆటలు, మహిళలకు ముగ్గుల పోటీలు ● ఉల్లాసంగా ఎడ్ల బండలాగుడు పందేలు ● విజేతలకు బహుమతుల ప్రదానం

జలదంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో మంగళ, బుధవారాలలో మహిళలకు ముగ్గులపోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు, యువతకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బ్రాహ్మణక్రాకలో జరిగిన పోటీలలో విజేతలకు మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, ఇందిర దంపతులు నగదు బహుమతులు అందించారు. గట్టుపల్లిలో టీడీపీ మండల నాయకుడు చేవూరి జనార్దన్‌రెడ్డి పాల్గొని సర్పంచు దంపతులు కాకాణి మహదేవ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

●అల్లూరు,(ఆంధ్రజ్యోతి) : అల్లూరులోని కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 100 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేత కందల రాజారెడ్డి, జోసెఫ్, కమల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

●బట్రకాగొల్లులో వ్యాపారవేత్త రాయి సురేష్ తన తల్లి సుందరమ్మ పేరుతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.3000, రూ.2000, రూ.1000 వంతున అందజేశారు. పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

●కొండాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా పిల్లలు, పెద్దలకు విడివిడిగా ఆటలు, క్రికెట్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. భీమవరప్పాడులో ఆటల పోటీలలో విజేతలకు కొమ్మి అంకపనాయుడు, టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం, ఏ.సతీష్, వి.శ్రీనివాసులు, కొమ్మి రమేష్‌లు సొంత నిధులతో విలువయిన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నాయకులు గద్దె రాఘయ్య, సీహెచ్.వెంకటాద్రి, వల్లూరు వెంకటేశ్వర్లు, చాగంటి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

●బిట్రగుంట (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావపేటలోని రైల్వే తెలుగు మీడియం పాఠశాల క్రీడామైదానంలో సంక్రాతి సందర్భంగా యంగ్‌లైన్స్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలకు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్రన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మండలంలోని పలుగ్రామాల నుంచి 8 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో లెజెన్స్ జట్టు విన్నర్‌గా బిట్రగుంట ఫుట్‌బాల్ క్లబ్ రన్నర్‌గా నిలిచారు. అలాగే సంక్రాతి సంబరాల్లో భాగంగా పిల్లలు, పెద్దలు, మహిళలకు వివిద రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యంగ్‌లైన్స్ కమిటీ సభ్యులు ఏ.సుబ్బారావు, పీ.శ్రీధర్, సాగర్, రాజశేఖర్, శ్రీనివాసులు, పెండ్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేత జీలు జట్టు

బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో కావలి నియోజక స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో బిట్రగుంట జీలు జట్టు విజేతగా నిలిచింది. బోగోలు, దగదర్తి, జలదంకి మండలాలకు చెందిన 25 జట్ల మధ్య రెండు రోజులపాటు పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన బిట్రగుంట జీలు జట్టుకు షేక్.సుల్తాన్ రూ.20 వేలు, రన్నర్‌గా నిలిచిన బేతనీపేట జట్టుకు ముస్తాక్‌బాషా రూ.10 వేలు, మూడవ స్థానంలో నిలిచిన కావలి జట్టుకు ప్రోత్సాహ బహుమతిగా టీడీపీ యువనేత అశోక్‌నాయుడు రూ.5 వేల అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బిజ్జం గోపాలకృష్ణారెడ్డి, శ్రీధర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

●దగదర్తి(బిట్రగుంట) (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం శ్రీరామాపురంలో సంక్రాతి సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. స్థానిక టీడీపీ నేతలు వడ్లపూడి సోలం, రవికృష్ణారెడ్డి, బత్తేపాటి తిరుమల శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు హోరాహోరీగా జరిగిన ఈ



అల్లూరు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్ర

పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విడవలూరు జట్టుకు రూ.15,016 ఈదల రవికృష్ణారెడ్డి, రెండో బహుమతి కొడవలూరు జట్టుకు రూ.13,016 స్థానిక టీడీపీ నేత, మూడవ బహుమతి బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి, నాల్గోవ బహుమతి గాలి సురేష్‌లు అందచేశారు. ఐదవ బహుమతి కమిటీ సభ్యులు అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ యువత ఇండ్ల కృష్ణయ్య, చంటి, ప్రసాద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో బీద సోదరులు

●అల్లూరు(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర, పెన్నార్ డెల్టా కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిదర్‌లు స్వగ్రామమైన మండలంలోని ఇస్కపల్లిలో సంబరాలు జరుపుకున్నారు. సోమవారం గ్రామానికి చేరుకుని భోగి, సంక్రాంతి పండుగలో సందడి చేశారు. బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, ఆటల పోటీల్లో విజేతలకు ఎంపీ మస్తాన్‌రావుతో కలిసి రవిచంద్ర బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాది తరలివచ్చి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గురు సోదరులు ఒకే చోట ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు స్థానికంగా ఉండే అభిమానుల తాకిడితో సంపూర్ణ సంక్రాంతి సందడి నెలకొంది. అదేవిధంగా మండలంలో ప్రజలు సంక్రాంతి పండుగలను వైభవంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కావలి మండలంలో...

●కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): కావలి మండలంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని రుద్రకోటలో ఫైర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాలల్లో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణా రెడ్డి పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

●కందుకూరు (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను కందుకూరు పట్టణంతో పాటు గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా గ్రామగ్రామాన వివిధరకాల ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు గ్రామకమిటీల నేతృత్వంలో బహుమతులు అంద చేశారు. బుధవారం కనుమ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

●లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : మండలంలో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చినపవని, లింగసముద్రం తదితర గ్రామాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే కనుమ పండుగ సందర్భంగా ప్రజలు పశువుల కొమ్ములకు రంగులు వేసి, గోమాతలను పూజించారు.

●వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలంలో సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను ప్రజలు మంగళ, బుధవారాల్లో ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కాకుటూరులో డ్యాన్స్‌లు, చుండి, పోలినేనిపాలెం గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కనుమ పండుగ రోజున పాడి రైతులు తమ పశువులకు రంగులతో అందంగా అలంకరించి పూజలు చేశారు.

●ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు వాడవాడలా వైభవంగా జరిగాయి. మంగళవారం పెద్దపండుగను పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, తిరునాళ్ళతిప్పలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు మకరజ్యోతిని వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, అలఘునాథస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిగాయి. శ్రీకృష్ణ సేవా సమితి, యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సౌజన్యంలో కృష్ణమందిరం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సీఐ జి గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య, టీడీపీ నాయకుడు తోడేటి వెంకటయ్య తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. బుధవారం కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. పశువులను శుభ్రం చేసి కొమ్ములకు రంగులు అద్దారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●సంగం : మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళ, బుధవారం సంక్రాంతి, కనుమ పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇళ్లలో ప్రత్యేక పూజలు చేశారు. కనుమ పండుగను పురస్కరించుకుని పశువులను అందంగా తీర్చిదిద్దారు.

మండలంలోని తిరుమనతిప్ప ఎస్టీ కాలనీలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం తదితర ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ నిర్వాహకులు సాంబయ్య, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాళ్ళచెలిక వీవర్స్ కాలనీలో సంక్రాంతిని పురస్కరించుకుని వీవర్స్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు

●అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంబంపాడు ధర్మపల్లెమ్మ ఆలయం వద్ద బుధవారం కనుమ పండుగను పురస్కరించుకొని ఎడ్ల బండ లాగుడు పోటీలు జరిగాయి. ఈపోటీల్లో మొదటి బహుమతి రూ. 40 వేలు, రెండవ బహుమతి రూ. 30 వేలు, మూడవ బహుమతి రూ. 20 వేలను అందించారు. బహుమతులను ఆత్మకూరు సీఐ గంగాదర్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. డియ్యల రమేష్, ఈ వెంకటరమణ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. టీడీపీ నాయకులు తాళూరి గిరినాయుడు, మెట్టుకూరు కృష్ణారెడ్డి, శాఖమూరి సుబ్బారావు, మాకిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, చల్లా శివారెడ్డి అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలను మంగళ, బుధవారాల్లో ప్రజలు వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు పెద్దల పండగను నిర్వహించారు. కనుమ రోజున పశువులకు పూజలు నిర్వహించారు.

●దుత్తలూరు: మండలంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ రోజున బంధుమిత్రులతో ఆనందంగా గడిపారు.

హెల్మెట్ తప్పక ధరించాలి



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఉదయగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

జలదంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీలో పరిధిలోని తొమ్మిదోమైలు వద్ద వరదారెడ్డి గిరిజనకాలనీ, బ్రాహ్మణక్రాక ఎస్సీకాలనీలో సీసీ రోడ్లు, రచ్చబండ నిర్మాణం, బాహ్మణక్రాకలో దేవరపల్లి క్రిష్ణారెడ్డి వీధిలో మురుగునీటి కాలువ నిర్మాణానికి బుధవారం కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచు, ఉపసర్పంచు ఇండ్ల సుధాకర్, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 70.255 టీఎంసీల నీరు

అనంతసాగరం జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 1,941 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 70.255 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ముమ్మరంగా టీడీపీ శాశ్వత సభ్యత్వాల నమోదు

ఉదయగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాలను స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, ఉదయగిరి, దుత్తలూరు టీడీపీ మండల కన్వీనర్లు చింతనబోయిన బయ్యన్న, పేలపూడి వెంకటరత్నం, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, టీడీపీ నాయకులు గడ్డం శ్రీనివాసులు, పోకల ప్రభాకర్‌రెడ్డి, పాలగిరి మహేష్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వాలను స్వీకరించారు.

●ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు చెందిన టీడీపీ ముఖ్య నాయకులు బుధవారం విరువూరులోని క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు కాకర్ల సురేష్ చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వం అందుకున్నారు. వరికుంటపాడు మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావుతో సహా గండిపాళెంకు చెందిన నియోజకవర్గ ఐటీడీపీ, గ్రామ బూత్ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరామ్, ప్రాజెక్టు చైర్మన్ అడుసుమల్లి వెంకట సుబ్బయ్యలు సభ్యత్వ నమోదు కార్డులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ శాశ్వత సభ్యత్వం పట్ల నాయకులు శ్రద్ధ వహించాలని సూచించారు.

●జలదంకి (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నాయకులు టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని పోటాపోటీగా తీసుకున్నారు. మంగళవారం వింజమూరులోని ఉదయగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా మండలంలోని గట్టుపల్లికి చెందిన మండల తెలుగురైతు మాజీ అధ్యక్షుడు కొల్లా క్రిష్ణ రూ.లక్ష చెల్లించి ఎమ్మెల్యే నుంచి టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. అలాగే బుధవారం ఉదయగిరి టీడీపీ పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు పి.మధుమోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు పూనూరు భాస్కర్‌రెడ్డి, నాయకులు చేవూరి జనార్దన్‌రెడ్డి, గుర్రం ప్రవీణ్, దండా పవన్‌కుమార్‌రెడ్డిలు ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

●కొండాపురం(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపుమేరకు మండలంలోని గరిమెనపెంట పంచాయతీకి చెందిన నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, టీడీపీ నాయకుడు అల్లిక మధులు పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి కాకర్ల సురేష్ నుంచి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. అలాగే గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం గ్రామానికి చెందిన తెలుగుయువత మాజీ మండలాధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు బుధవారం శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డీఆర్‌కు నివాళి

కావలిటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) 15వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. జేబీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని డీఆర్ స్మారక స్తూపం వద్ద, డీఆర్ ఇండోర్ స్టేడియంలోని డీర్ విగ్రహం వద్ద విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీ దంపతులు, ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్ మాల్యాద్రి అధ్యాపకులు తదితరులు ఘన నివాళులర్పించారు.

గిరిజన కాలనీలో...

కావలి,(ఆంధ్రజ్యోతి): దొడ్ల రామచంద్రారెడి (డీఆర్) వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కావేరిగుంట గిరిజన కాలనీలో డాక్టర్ రాంసెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాంసెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనంతాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, గిరిజనులు తుపాకుల భవాని, రాంబాబు, సుధాకర్, పద్మ, మౌనిక తదితరులు పాల్గొని డీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

వివాహిత ఆత్మహత్య

బిట్రగుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జక్కేపల్లిగూడూరుకు చెందిన పేరం క్రిష్ణమ్మ (56) అనారోగ్య సమస్య కారణంగా ఆత్మహతకు పాల్పడింది. ఈ మేరకు ఆమె భర్త రఘురామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. క్రిష్ణమ్మ ఐదేళ్ల నుంచి గుండె, కడుపు నొప్పులతో బాధపడుతోంది. ఈ క్రమంలో సంక్రాంతి పండుగకు ఇద్దరు కుమారులు, కోడళ్లు ఇంటికి వచ్చారు. అదే రోజు ఆమె కడుపులో నొప్పి భరించలేక అవస్థపడింది. ఆసుపత్రికి వెల్దామను కుంటున్న లోపే ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. వెంటనే వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వం అభినందనీయం

ఆత్మకూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వం అభినందనీయమని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలోని నిత్యాన్నదాన ప్రాంగణంలో బుధవారం సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని పలువురు టీడీపీ నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

వాతావరణశాఖ సంబరాలు

కావలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భారత వాతావరణశాఖ దేశసేవలో 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కావలి వాతావరణ శాఖ కార్యాలయంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. వాతావరణశాఖ ఇన్‌చార్జి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి ఈ సందర్భంగా బహుమతులు అందచేశారు.